సువర్ణ సింహాసన వైభవం


వివిధ విభాగాలను అమర్చి.. సింహాసనాన్ని తీర్చిదిద్దారిలా..

మైసూరు, న్యూస్‌టుడే : చారిత్రక మైసూరు రాచనగరి ప్యాలెస్ ప్రాంగణంలోని 'అంబావిలాస'లో ప్రైవేటు దర్బారు నిర్వహించేందుకు రత్నఖచిత బంగారు సింహాసనాన్ని నిపుణులు శుక్రవారం జోడించారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్యాలెస్‌లోకి సందర్శకులను అనుమతించలేదు. అక్టోబరు 3 నుంచి అక్టోబరు 12 వరకు ప్యాలెస్ ఆవరణలో ప్రైవేటు దర్బార్ కొనసాగుతుంది. ఈ సింహాసనానికి రాజవంశస్థుడు కృష్ణదత్త ఒడెయరు సంప్రదాయక పూజలు చేసి.. అధిరోహిస్తారు. రోజులో కొంత సమయం సింహాసనంపై కూర్చుని ప్రైవేటు దర్బారు నిర్వహిస్తారు. ప్యాలెస్ ఖజానాలో 13 భాగాలుగా ఉన్న సింహాసనాన్ని నిపుణులు మూడు గంటలు శ్రమించి బిగించారు. స్వాతంత్ర్య పూర్వం మైసూరు యదురాజులు ఈ సింహాసనంపై కూర్చుని పాలన చేసేవారు. రాజరికాలు రద్దయిన అనంతరం దసరా ఉత్సవాల సమయంలో మాత్రమే రాజవంశస్థులు దీనిపై కూర్చుని ప్రైవేటు దర్బారు నిర్వహిస్తూ వస్తున్నారు. తన తండ్రి నరసింహరాజ ఒడెయరు అనంతరం ఎంపీగా కృష్ణదత్త ఒడెయరు ఈసారి ప్రైవేటు దర్బారులో సింహాసనాన్ని అధిష్ఠించనున్నారు.


రాచమందిరం ముంగిట పర్యాటక ఆకర్షక ప్రదర్శనలు

లోకాయుక్త విచారణకు కుమార

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : గంగేనహళ్లిలో భూముల డీనోటిఫికేషన్‌కు సంబంధించిన కేసు విచారణకు కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి లోకాయుక్త ముందు విచారణకు శుక్రవారం హాజరయ్యారు. దిల్లీ నుంచి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన నేరుగా లోకాయుక్త కార్యాలయానికి వెళ్లారు. గంటకు పైగా అధికారులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ.. తనపై 2015లో అప్పటి ప్రభుత్వం అక్రమంగా కేసు నమోదు చేసిందని ఆరోపించారు. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం ద్వారా తాను లబ్ధి పొందానని కొందరు తప్పుడు ఫిర్యాదులు చేయించారని పేర్కొన్నారు. లోకాయుక్త అధికారుల ప్రశ్నలకు తాము బదులిచ్చానని తెలిపారు.



లోకాయుక్త కార్యాలయం నుంచి బయటకు వస్తున్న కుమారస్వామి

ఆమెను చంపేశానని అమ్మకు చెప్పాక..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అదొక దారుణ ఘటన. రాష్ట్రాన్ని వణికించిన వయ్యాలికావల్ పరిధి మునేశ్వర బ్లాక్ నివాసి మహాలక్ష్మి అనే యువతి హత్య ఘటన కళ్ల ముందే కదలాడుతుండగా.. ఆ అంశంపై అనేక దిగ్భ్రాంతికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమెతో సహజీవనం చేసిన ఒడిశా రాష్ట్రవాసి ముక్తిరంజన్ రాయ్.. నగరం నుంచి పారిపోవడానికి పెద్ద సాహసమే చేసి- చివరికి ఆవేదనతో తనువు చాలించాడని బెంగళూరు పోలీసు కమిషనర్ దయానంద్ వివరించారు. ఆయన శుక్రవారం విలేకర్లకు అందించిన సమాచారం ప్రకారం.. ఓబిడ్డకు జన్మనిచ్చాక భర్తకు దూరంగా ఉంటున్న నేపాలీ మహిళ లక్ష్మితో రాయ్‌కు మల్లేశ్వరంలోని ఓ సంస్థలో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ అక్కడే పనిచేస్తూ.. సహజీవనం దిశగా సాగారు. పెళ్లి చేసుకోవాలంటూ ఆమె పట్టుబట్టడంతో రాయ్ మొండికేసి ఆమెతో గొడవకు దిగేవాడని గుర్తించారు. ఇలా.. ఆ గొడవ ఫలితంగా ఆగ్రహావేశాలకు లోనై ఆమెను చంపేసి, 59 ముక్కలుగా చేసి, ఫ్రిజ్‌లో కుక్కి నగరం నుంచి పారిపోయాడు. ఓ ద్విచక్రవాహనంపై ఆంధ్రప్రదేశ్ మీదగా ఒడిశాకు 1,550 కిలోమీటర్ల దూరం ప్రయాణించాడు. అలా తన సొంత ఊరు భద్రక్ సమీపంలోని బోనిపుర వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. భద్రక్ జిల్లా దుస్రి పోలీసురాణా పరిధిలో చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడే రాయ్ రాసిన ఓ లేఖను స్వాధీనం చేసుకున్నామని కమిషనర్ వివరించారు. రాయ్ సోదరుడు బెంగళూరులోనే ఉంటున్నాడు. హత్య చేశాక హెబ్బగూడిలో ఉంటున్న తమ్ముడి ఇంటికి వెళ్లి- మహాలక్ష్మిని హత్య చేశానని చెప్పి- అక్కడున్న ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. ఒడిశాకు వెళ్లిన తరువాత హత్య విషయాన్ని తల్లికి వివరించి.. ఎటో వెళ్లిపోయాడు. దుస్రి సమీపంలో ఓ శ్మశానవాటికలో ఆత్మహత్య చేసుకున్నాడన్న సమాచారం ఇటు పోలీసులను- అటు ఆ కుటుంబ సభ్యులను ఉలిక్కిపడేలా చేసింది.


మహాలక్ష్మి

రేవణ్ణ అర్జీ విచారణ వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మహిళను లైంగికంగా వేధించిన ఆరోపణలతో తనపై నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ వేసుకున్న అర్జీ విచారణను ఉన్నత న్యాయస్థానం అక్టోబరు 30కి వాయిదా వేసింది. హొళెనరసీపుర ఠాణాలో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కాలావకాశం లేకపోవడంతో విచారణను వాయిదా వేస్తున్నామని జస్టిస్ ఎం నాగప్రసన్న తెలిపారు.

ముడా రచ్చ.. రాజకీయ మచ్చ

ఈనాడు, బెంగళూరు : కన్నడనాట నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం.. రెండు సార్లు ముఖ్యమంత్రి.. ఓసారి ఉపముఖ్యమంత్రి.. 15 రాష్ట్ర బడ్జెట్‌ల రూపకర్త.. వర్తమాన దేశ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞులైన నేత.. అధికారంలో ఉన్నా లేకున్నా గర్జన తగ్గని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయ జీవిత చరమాంకంలో మాయని మచ్చ ఏర్పడింది. రాజకీయ ఆందోళనలో చిన్నపాటి కేసులు మినహాయించి ఏనాడూ కోర్టులు, పోలీసుల రికార్డుల్లో పేరు నమోదు కాని 77 ఏళ్ల సిద్ధరామయ్య పేరుతో ఓ ఎఫ్ఐఆర్ నమోదైంది. అది కూడా ఏ1 అపరాధిగా. యడియూరప్ప, కుమారస్వామి వంటి రాజకీయ ప్రత్యర్థుల బంధుప్రీతిని నిత్యం తెగనాడే సిద్ధరామయ్య నేడు అదే ప్రీతికి లొంగి తన స్వచ్ఛమైన రాజకీయ జీవితానికి మచ్చ తెచ్చుకున్నారు. మరో ఏడాది గడిచి ఉంటే స్వచ్ఛందంగా రాజకీయ నివృత్తి చేసేవారే. ఆలోగానే 'ముడా' పేరిట ఉపద్రవం నిత్యం తెల్లటి వస్త్రాలతో కనిపించే సిద్ధరామయ్యను ముంచెత్తింది. తాను కోరలు పీకి వేసిన లోకాయుక్త చెరలో రేపో మాపో చేతులు కట్టుకుని బదులివ్వాల్సిన స్థితికి చేరుకున్నారు.

సొంత ఊరిలోనే..

తన సొంత జిల్లా మైసూరులో జిల్లా పంచాయతీ ప్రాంగణంలో సుదీర్ఘంగా ప్రగతి పరిశీలన చేస్తున్న సిద్ధరామయ్యకు పిడుగు లాంటి వార్త వినాల్సి వచ్చింది. ఆ జిల్లా లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ స్వయంగా తయారు చేసిన 16 పుటల ఎఫ్ఐఆర్ నివేదిక సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారటంతో సిద్ధరామయ్య కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తాను తప్పు చేయలేదు. రాజీనామా చేయనని పదేపదే ప్రకటించే సిద్ధరామయ్యకు రాజకీయపరంగా ఆ పరిస్థితి రాకపోయినా అంతకు మించిన అవమాన భారంతో కుంగే పరిస్థితి ఎదురైంది. అందుకు కారణం.. సతీమణి పార్వతమ్మతో పాటు ఆమె సోదరులు మల్లికార్జున స్వామి తనతో పాటు రానున్న రోజుల్లో పోలీసుల పర్యవేక్షణలో ఉండబోతున్నారు. తనపై వచ్చే రాజకీయ విమర్శలు, ఆరోపణలను ఎంతో ధీమాతో తిప్పికొట్టగలిగిన సిద్ధరామయ్య నేడు అనివార్యంగా పోలీసుల నోటీసులకు బదులిస్తూ లోకాయుక్త కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. సొంత జిల్లా అభివృద్ధి మాటున చోటు చేసుకున్న అక్రమాల్లో తన హస్తం లేదని నిరూపించేందుకైనా సిద్ధరామయ్య ఈ కేసును ఎదుర్కోవాల్సిందే.

చివరికి దారెటు?

తనపై నమోదైన కేసులపై ముందస్తు బెయిల్ కోసం సెషన్స్ కోర్టుకు దరఖాస్తు చేసుకోవటం, గవర్నర్ ఆదేశాలను సవాలు చేస్తూ ఉన్నత ధర్మాసనానికి దరఖాస్తు చేయటం లేదా తనపై నమోదైన లోకాయుక్త కేసును కొట్టివేయాలని కోర్టుకు అప్పీల్ చేసేందుకు సిద్ధరామయ్య న్యాయ సలహా మండలి కసరత్తు చేస్తోంది. ఆయన తరఫు న్యాయవాదులు శనివారమే దిల్లీకి వెళ్లి అభిషేక్ మనుసింఘ్వితో చర్చించి న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆలోగా లోకాయుక్త పోలీసులు విచారణ కోసం ముఖ్యమంత్రిని, ఆయన బంధువులను అరెస్టు చేసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రిని అరెస్టు చేయాల్సిన అనివార్యత పోలీసుల విచక్షణ అధికారానికి వర్తించే అంశం.



వివాదాలకు నిలయం.. మైసూరు నగరాభివృద్ధి సంస్థ కార్యాలయం


సిద్ధరామయ్య


సహ కార్యకర్త అబ్రహం


సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ

ఊహించిందేనా?

లోకాయుక్తకు ఈ అక్రమాలపై తనిఖీ ఆదేశాలు ప్రత్యేక కోర్టు నుంచి వెల్లడించగానే సిద్ధరామయ్యలో ఎలాంటి ఆందోళనా వ్యక్తం కాలేదు. పైపెచ్చు ఆయనకు మంత్రివర్గ సహచరులతో పాటు అధిష్ఠానం నుంచి కొండంత అండ దొరికింది. సిద్ధరామయ్యను ఓ వ్యక్తిగా కాకుండా ఆయనను పార్టీ ప్రతిష్ఠగా భావించి రక్షణ కల్పిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భరోసా ఇచ్చారు. కేసు నమోదు కాకముందు, ఆ తర్వాత సిద్ధరామయ్య పరిస్థితి భిన్నం కానుంది. మొన్నటి వరకు మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, కుమారస్వామి కేసులను ప్రస్తావించే సిద్ధరామయ్య నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా కేసులను ప్రస్తావిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. 2011లో యడియూరప్పపై లోకాయుక్త కేసు నమోదు కాగానే ఆయన రాజీనామా చేశారు. ఆ రాజీనామాను డిమాండ్ చేసిన వారిలో సిద్ధరామయ్య ఒకరు. విపక్ష నేతగా యడియూరప్ప రాజీనామా కోసం సభలో డిమాండ్ చేసిన సిద్ధరామయ్య నేడు అదే లోకాయుక్త కేసు నమోదు చేయటంలో ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. యడియూరప్పపై కేసు నమోదైన సమయంలో సొంత పార్టీ నుంచే విమర్శలు ఎదురవటం.. ఆ పరిస్థితి నేటి కాంగ్రెస్‌లో లేకపోవటం సిద్ధరామయ్యకు కలిసొచ్చే అంశం.

● కోర్టు ఆదేశాలున్నా ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేసేందుకు 48 గంటల సమయం తీసుకున్న లోకాయుక్త పోలీసుల విధులపై ఫిర్యాదుదారుడు స్నేహమయి కృష్ణ సంశయాన్ని వ్యక్తం చేశారు.

నమోదైన కేసులు..

ఐపీసీ సెక్షన్లు..	అభియోగం
120బి	నేరపూరిత కుట్ర
ఐపీసీ13	ప్రభుత్వ అధికార దుర్వినియోగం
6	లంచాల స్వీకారం
166	ప్రజా ప్రతినిధుల చట్టాల ఉల్లంఘన
403	అక్రమంగా ఆస్తుల ఆర్జన
406	నేరపూరిత నమ్మక ద్రోహం
420	వంచనతో లాభం పొందటం
426	మోసాన్ని కప్పి ఉంచే ప్రయత్నం
465	దొంగ సంతకాలు,
468	మోసాన్ని కప్పిపుచ్చేలా దాఖలాల సవరణ
340	అక్రమంగా బంధించటం
353	ఇతరులకు హాని కలిగించటం
351	దాడుల పేరిట భయం

చట్టాలు : కర్ణాటక భూఅక్రమాల నిషేధ నియంత్రణ, బినామీ ఆస్తుల విక్రయాల నియంత్రణ, అవినీతి నిరోధక చట్టం ప్రకారం బెయిల్ రహిత కేసులతో పాటు కనీసం 3 ఏళ్ల నుంచి జీవితకాల శిక్ష పడే వీలుంది.

అపరాధులు: ఏ1-సిద్ధరామయ్య, ఏ2- పార్వతమ్మ(సిద్ధు భార్య), ఏ3- మల్లికార్జున స్వామి(సిద్ధు బావమరిది), ఏ4. దేవరాజు(భూములు విక్రయించిన వ్యక్తి), ఏ5-ఇతరులు.

పర్యాటకమే శాంతికపోతం

మైసూరు, న్యూస్‌టుడే : విఖ్యాత దసరా ఉత్సవాలను ఈసారి ఘనంగా ఆచరించుకుందామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్యాలెస్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 'పర్యాటకం-శాంతి' ఉత్సవాలను ప్రారంభించారు. వివిధ కళాకారులు, స్థానిక కళాసంఘాల ప్రతినిధుల జాతాకు ఆయన జెండా ఊపారు. అభిమన్యు, ఇతర ఏనుగుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. మైసూరు పర్యాటకం వెబ్‌సైట్, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. మైసూరు నగరం, జిల్లాలోని పర్యాటక విశేషాలు, స్థానిక చరిత్రను తెలిపే చిరు పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా, ప్రజలందరి సహకారంతో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మెరుగైన రవాణా సాధనాలు, అదనపు బస్సులు, రైళ్లు, విమాన సేవలు అందుబాటులో ఉండడంతో ఇప్పటికే ఎక్కువ మంది ప్యాలెస్ టికెట్లు బుక్ చేసుకున్నారని తెలిపారు. ప్యాలెస్‌లో ప్రారంభమైన జాతా నగరంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్, ఎమ్మెల్సీ యతీంద్ర, పార్టీ ప్రతినిధులు హెచ్‌ఎం రేవణ్ణ, పుష్పా అమరనాథ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సిద్ధరామయ్యను సత్కరిస్తున్న స్థానిక పౌర సంఘాల ప్రతినిధులు


సాంస్కృతిక వేదిక వద్ద ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వందనం చేస్తున్న ఏనుగులు

రాచనగరిలో జన జాతర!

మైసూరు, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు ప్రభుత్వ వేడుకలు కాదని, ఇవి ప్రజల జాతరని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. దసరా ఉత్సవాల నిర్వహణలోని అధికారులు, సిబ్బంది మినహా ఇతరులు అభివృద్ధి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అన్ని న్యాయస్థానాల కన్నా జనతా న్యాయస్థానం, ఆత్మసాక్షి ముఖ్యమని మహాత్ముడు చేసిన సూచనలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మైసూరు జిల్లా ప్రగతి పరిశీలన సమావేశాన్ని ఆయన శుక్రవారం నిర్వహించారు. సుదీర్ఘంగా కొనసాగిన సమావేశంలో రవాణా, ఆహార, పౌరసరఫరాల, ఉద్యానవన, ఆరోగ్య, పట్టు, పశుసంవర్ధక, మత్స్య తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పని విషయంలో ఒక అబద్ధం చెబితే.. దాన్ని రుజువు చేసేందుకు మరో అబద్ధం చెప్పవలసి ఉంటుందన్నారు. పోలీసులు నేరాలను నియంత్రిస్తేనే ప్రగతి సాధ్యమని తెలిపారు. ఆరోగ్యం, విద్య, ఆహారం, నీరు, విద్యుత్తు, రహదారి సురక్షతకు తాను పెద్ద పీట వేస్తున్నానని గుర్తు చేశారు. కులం, మతం ఆధారంగా సేవలందించే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అభివృద్ధి పనులు, గ్యారంటీ పథకాలకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. సకాలంలో వర్షాలు కురవడంతో రైతులకు కావలసిన ఔషధాలు, ఎరువులను అందిస్తున్నామని అధికారులు తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు వరి, పొగాకు పంటల్ని నష్టపోయిన రైతులకు పరిహారం అందించామన్నారు. ఈ ఏడాది పంట నష్టపోయిన రైతులకు రూ.63 కోట్ల పరిహారం ఇచ్చామని చెప్పారు. రుణ భారంతో 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, వారిలో 26 మంది కుటుంబ సభ్యులకు పరిహారం ఇచ్చామని తెలిపారు. తాను గ్రామంలో పాలకేంద్రాలకు వెళ్లి, రైతులతో సమావేశం అవుతున్నానని చెప్పిన ఒక అధికారిపై సీఎం ప్రశ్నల వర్షం కురిపించారు. మీరు సమావేశం అయినదానికి ఆధారంగా ఫొటోలు చూపించాలని సూచించారు. చరవాణిలో ఫొటో చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యానవన శాఖకు సంబంధించి అధికారి ఒకరు తప్పు సమాచారం ఇవ్వడంతో ఆయనను సిద్ధు మందలించారు. సమావేశానికి హాజరైనప్పుడు హోం వర్కు చేసి రావాలని సూచించారు. మైసూరు మహారాజులు ఈ ప్రాంతంలో పట్టు సాగును ప్రోత్సహించారని, ఇటీవల అధికారుల నిర్లక్ష్యంతో సాగు తగ్గుతున్నట్లు వార్తలు వచ్చాయని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్లెటూళ్ల నుంచి పాలు నగరానికి వస్తుంటే.. పట్టణాల నుంచి ఆల్కాహాలు పల్లెలకు వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి సారాయి, నాసిరకం మద్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. గ్యారంటీ పథకాల వివరాలను అధికారుల నుంచి సేకరించారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో అల్పాహారంగా మిరపకాయ బజ్జీలు తీసుకు వచ్చారు. ఉల్లిపాయ బజ్జీలు లేవా అని అడిగి తెప్పించుకున్నారు.


వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సిద్ధరామయ్య

వంచన కేసులో అరెస్టు


బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఓ వంచన సంఘటనతో సంబంధం ఉందనే అభియోగంపై ప్రైవేటు ఛానల్ నిర్వహిస్తున్న మునీంద్ర కుమార్ అలియాస్ జీఎం కుమార్ అనే వ్యక్తిని బెంగళూరు పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా ఆయనను ఐదు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు. జీఎం కుమార్, అశ్విన్ అనే వ్యక్తులు ఓ మీడియా సంస్థ ప్రారంభించారు. కొద్ది రోజులకు అశ్విన్‌ను తప్పించి, సంస్థను కుమార్ స్వాధీనం చేసుకొని రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారనేది అభియోగం. ఈ అంశంపై అశ్విన్ 2022లో విజయనగర పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రమంలో ఈ అరెస్టు చోటుచేసుకుంది.

బైందూరు మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ కన్నుమూత

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బైందూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మీనారాయణ (85) బెంగళూరులో శుక్రవారం కన్నుమూశారు. కొన్నేళ్ల కిందట ఆయన భార్య మరణించారు. డాలర్స్ కాలనీలోని నివాసంలో అభిమానులు, భాజపా కార్యకర్తల కోసం భౌతికకాయాన్ని ఉంచారు. బనశంకరి శ్మశానవాటికలో శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు. భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్ర, ఇతర నాయకులు భౌతికకాయానికి అంతిమ నివాళి అర్పించారు. దక్షిణ కన్నడ జిల్లాలో ప్రజానాయకుడిగా ఆయనకు మంచి పేరుందని గుర్తుచేసుకున్నారు.


అదో టైపు కళ!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత ఉద్యోగి ఏసీ గురుమూర్తి (75) టైపో ఆర్టిస్టుగా ఇప్పటికే రెండు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. తాను పదో తరగతి చదువుతున్నప్పుడు ఆసక్తితో కొనుగోలు చేసుకున్న టైపు రైటర్‌ను టైపింగ్ కోసమే వినియోగించుకుంటూ వచ్చారు. పదవీ విరమణ చేసే సమయానికి దానిపై బొమ్మలు వేయడాన్ని అభ్యాసం చేశారు. పదవీ విరమణ అనంతరం పూర్తి సమయం టైపో ఆర్టిస్టుగా మారి గుర్తింపు తెచ్చుకున్నారు. తన టైపు రైటర్‌కు ఆరు దశాబ్దాల వయసు వచ్చినా, దానిపైనే బొమ్మలు వేస్తున్నానని ఆయన తెలిపారు. దానిపై టైపు చేస్తున్న సమయంలో వచ్చే శబ్దం సంగీతంలా వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. యంత్రానికి చిన్న చిన్న మరమ్మతులను తానే చేసుకోవడంతో పాటు, వినియోగించేందుకు కావలసిన రంగుల రిబ్బన్లను ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నానని వివరించారు.


తన టైపు రైటర్‌తో ఏసీ గురుమూర్తి

ఉద్యోగాలంటూ.. నయవంచన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అంతర్జాల వేదికలపై ఉద్యోగాల టాస్క్‌పేరుతో ప్రజల నుంచి రూ.6 కోట్లు వసూలు చేసి మోసగించిన పదిమంది నిందితుల ముఠాను బెంగళూరు కేంద్ర నేర నియంత్రణ దళః (సీసీబీ) అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 72 సెల్‌ఫోన్లు, 182 డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌టాప్‌లు, 133 సిమ్‌కార్డులు, 127 బ్యాంకు పాస్‌పుస్తకాలు, రూ.1.74 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ దయానంద్ ప్రకటించారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిందితులు సైయద్ యాయ, ఉమర్ ఫారూక్, మహ్మద్ మాహిన్, మహ్మద్ ముజామిల్, తేజేశ్, చేతన్, వసీం, సయ్యద్ చామీద్, సహి అబ్దుల్ ఆసాన్, ఓంప్రకాశ్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు ధ్రువీకరించారు. ఆ వివరాల్లోకి వెళితే.. బాగలగుంటె, టి.దాసరహళ్లిలోని ఓవ్యక్తి సెల్‌ఫోన్‌కు జూన్ 7న నిందితులు ఆన్‌లైన్ ఉద్యోగాలంటూ సందేశం పంపించారు. వాట్సప్‌లో కొన్ని లింక్‌లు పంపించారు. టెలిగ్రాం గ్రూప్‌లో ఆవ్యక్తి పేరు చేర్పించి టాస్క్ ఇచ్చారు. విలాసవంతమైన హోటళ్లకు వెళ్లి రివ్యూ చేయాలని సూచించారు. రివ్యూ చేసే సమయంలో రూ.150 నుంచి రూ.200 డిపాజిట్ చేస్తే రూ.400 నుంచి రూ.500 మీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించారు. ఇలా డబ్బులు సంపాదించాలనే ఆశ చూపించారు. నిదానంగా క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలా తన నుంచి రూ.25,37,815 నగదు ఖాతా ద్వారా మార్పించుకుని మోసగించారని ఆ బాధితుడు ఉత్తర విభాగం సైబర్ పోలీసురాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల బ్యాంకు ఖాతాలను తనిఖీ చేసి వివరాలు సేకరించారు. పది మంది నిందితుల్లో ఏడుగురిని ఈనెల 17న రాత్రి ఆర్‌టీనగరలోని ఓ హోటల్ వద్ద అరెస్టు చేసి మూడు సంచులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సంచుల్లో 99 డెబిట్ కార్డులు, 50 బ్యాంక్ ఖాతా పుస్తకాలు, 41 సిమ్ కార్డులు ల్యాప్‌టాప్‌లు, 23 సెల్‌ఫోన్లు, రూ.1.24 లక్షల నగదు గుర్తించామని కమిషనర్ దయానంద్ తెలిపారు. ఆ నిందితుల నుంచి మరింత సమాచారం సేకరించి మరో ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ నిందితులపై 21 రాష్ట్రాల్లో 122 ఎన్‌సీఆర్‌పీ నిబంధనల కింద కేసులు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పది కేసులున్నట్లు డీసీపీ సైదులు ఆడావత్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఆహార కల్తీకి అడ్డుకట్ట


దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాగర్‌సింగ్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దేశంలో కల్తీ ఆహార పదార్థాలను నియంత్రించే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని, వాటికి మరింత పదును పెడతామని కేంద్ర ఆహార, సరఫరాల శాఖ సంయుక్త సంచాలకుడు సాగర్‌సింగ్ వెల్లడించారు. బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శనశాలలో 'ఎఫ్‌ఐ ఇండియా, ప్రోప్యాక్ ఇండియా-2024' పేరిట ఓ ప్రదర్శనను ఆయన శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. ప్యాకేజీ ఆహార పదార్థాల్లో నాణ్యత పరిశీలనకు కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు వివరించారు. కల్తీ నియంత్రణకు అన్ని రకాల చర్యలూ చేపడుతున్నట్లు తెలిపారు. బెంగళూరు నగరంలో ఆహార పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రపంచ ప్యాకేజింగ్ విభాగ రాయబారి చక్రవర్తి, వివిధ ఆహార రంగాల నిపుణులు యోగేశ్ ముద్రాస్, ప్రసాద్ బాలన్ అయ్యర్, రాజేశ్వర్ మ్యాజి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిందే!

● మాజీ మంత్రి శ్రీరాములు డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బి.శ్రీరాములు, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ముడా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని మాజీ మంత్రి బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి తాను పాల్గొన్న కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడిన వారు తక్షణమే రాజీనామా చేయాలని పలుమార్లు ప్రకటించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనే ఇప్పుడు రాజీనామా చేయాలన్నారు. ఈడీ దర్యాప్తులో మాజీ మంత్రి బి.నాగేంద్ర వ్యక్తిగత కార్యదర్శి విజయకుమార్ తన డైరీలో లోక్‌సభ ఎన్నికల్లో వాల్మీకి కార్పొరేషన్ నిధులు ఏయే తాలూకాకు, ఓ బూత్‌కు ఎంత ఖర్చు చేయాలని స్పష్టంగా రాసినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ బళ్లారి లోక్‌సభ స్థానానికి ఇ.తుకారామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ కృపాకటాక్షంతో నాలుగు సార్లు ఎమ్మెల్యే, లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది దొడ్డిదారిలో వచ్చారు. ఈ విషయంపై నియోజకవర్గం ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. నువ్వు సవాల్ చేయడం సరికాదన్నారు. నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. భాజపా ప్రభుత్వంలో నారిహళ్లి జలాశయం నుంచి సండూరు పట్టణంతో పాటు వేర్వేరు గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం రూ.1600 కోట్లతో టెండర్ పూర్తి చేసి గుత్తేదారులకు పనులు అప్పగిస్తే...రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇ.తుకారామ్ పనులను నిలిపివేశారని శ్రీరాములు విమర్శించారు. సీబీఐ ఇకపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతితోనే విచారణ చేయాలని మంత్రి మండలిలో తీర్మానం చేయడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వంపై మరింత అనుమానం వస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల అక్రమాలపై కోర్టుకు వెళ్లడానికి సమయం మీరి పోయింది. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలని న్యాయవాదులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 17న కలబురగిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సండూరు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో నేను పోటీ చేయడం లేదు. పార్టీ అధిష్ఠానం సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్ మాట్లాడుతూ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన ఇ.తుకారామ్ సండూరు శాసనసభ్యుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వాల్మీకి కార్పొరేషన్ నిధుల్లో రూ.21.6 కోట్లు ఉపయోగించినట్లు వెలుగులోకి వచ్చిందని, దీనికి ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, ఓబులేశ్, మల్లేష్ పాల్గొన్నారు.

సేవలతో మమేకం.. వరించిన పురస్కారం

● గాంధేయవాది శివరాజు, హావేరి జిల్లా గురుకుల పాఠశాలకు గుర్తింపు

బళ్లారి, న్యూస్‌టుడే: హావేరి జిల్లా హొసరత్తి గ్రామం గుడ్లెప్ప హళ్లికేరి స్మారక ప్రతిష్ఠాత్మక గాంధీ గ్రామీణ గురుకుల వసతి పాఠశాల, ప్రముఖ గాంధేయవాది జి.బి. శివరాజు ప్రతిష్ఠాత్మక మహాత్మాగాంధీ సేవా పురస్కారానికి ఎంపికైనట్లు వార్త శాఖ కమిషనర్ హేమంత్ ఎం. నింబాళ్కర్ వెల్లడించారు. పురస్కారంతో పాటు రూ.5లక్షలు నగదు బహుమతి అందిస్తున్నారు. 2024 ఏడాదికిగాను మహాత్మాగాంధీ సేవా పురస్కారం తుమకూరు జిల్లా తరువేకెరె తాలూకా, గొట్టికెరె గ్రామానికి చెందిన జి.బి.శివరాజు, హావేరి జిల్లా హొసరత్తి గ్రామం గుడ్లెప్ప హళ్లికేరి స్మారక ప్రతిష్ఠాత్మక గాంధీ గ్రామీణ గురుకుల వసతి పాఠశాలను ఎంపిక చేసింది. తలా రూ.2.5 లక్షల నగదు, పురస్కారం అక్టోబరు 2న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రదానం చేయనున్నారు.

సత్యం, అహింస, స్వావలంబన, గ్రామ స్వరాజ్, అంటరానితనం నిర్మూలన అనే సూత్రాలు అవలంబిస్తూ మహాత్మా గాంధీ ఆశయ సాధనకు గొప్ప కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి మహాత్మాగాంధీ సేవా పురస్కారం ప్రదానం చేస్తోంది. జాతిపిత ఆలోచనలు, ఖాదీ కార్యకలాపాలు, జీవిత విద్య, ఇతర ఆదర్శాలు పొందిన వారికి సమాచార పౌరసంబంధాల శాఖ ఈ పురస్కారాన్ని అందిస్తోంది. ఈ పురస్కారానికి ప్రముఖ గాంధేయవాది జి.బి.శివరాజు, గాంధీ గ్రామీణ గురుకుల పాఠశాలను ఎంపిక చేయడం గమనార్హం.



గాంధీ గ్రామీణ గురుకుల వసతి శాల

ఆ బడి శీలనిర్మాణ గుడి

హావేరి జిల్లా హాల్లికేరి గ్రామంలో 1984 అక్టోబరు 2న గుడ్లెప్ప హళ్లికేరి స్మారక సంస్థను స్థాపించి గాంధీ గ్రామీణ గురుకుల వసతి శాల 39 ఏళ్లుగా గాంధీ ఆశయాలతో సాగుతోంది. ఈ పాఠశాలలో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గ్రామీణ రైతులు, సమాజంలోని అన్ని వర్గాల కూలీ కుటుంబాల నేపథ్యం నుంచి వచ్చిన వేలాది మంది విద్యార్థులకు ఆహారం, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు స్వయంగా నేసిన దుస్తులను ధరిస్తారు. వారు స్వయంగా పండించిన పంటల నుంచి తయారు చేసిన ఆహారాన్ని తీసుకుంటారు. దేశంలో అంతర్గత విభేదాలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విద్యను బోధిస్తున్నారు. పాఠ్యాంశాలతో పాటు, గాంధీ సిద్ధాంతాల ప్రకారం వ్యవసాయం, స్పిన్నింగ్, నేత, పాడి పరిశ్రమ, ఉద్యానవనం వంటి వాటిలో విద్యార్థులకు స్వావలంబన, ఆచరణాత్మక విద్యను బోధిస్తున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో చాలా మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ పాఠశాలకు అక్టోబరు 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేస్తారు.



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

జాతిపిత భావజాల వ్యాప్తికి కృషి



విశ్రాంత ఉపన్యాసకుడు **జి.బి.శివరాజు గాంధీ** భావజాలాన్ని పెంపొందించేందుకు శ్రమించారు. 73 ఏళ్ల వయస్సులో గాంధీ సిద్ధాంతాలను తెలియజేయడానికి కృషి చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల సహకారంలో మద్యపాన నిషేధంపై నిరంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. అరసీకెరెలో కస్తూర్బా గాంధీ ఆశ్రమం పునరుద్ధరించారు. మూడిగెరెలో భారతి బైల్ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. మండ్య జిల్లాలోని మార్నోమిదొడ్డి గ్రామంలో కస్తూర్బా గాంధీ ట్రస్ట్‌ను ఉప కేంద్రం స్థానికుల సహకారంతో ప్రారంభించి, గ్రామీణ మహిళల కోసం స్వయం ఉపాధి కార్యశాలను అభివృద్ధి చేశారు. 20 ఎకరాల కంటే ఎక్కువ భూమిలో స్థానిక ప్రజలు సహకారంతో స్థిరమైన వ్యవసాయ పనులు ప్రారంభించారు. మైసూరులోని మానవ గంగోత్రి సబర్మతి తరహాలో ఆశ్రమం నిర్మించారు. గదగ జిల్లాలోని కర్ణాటక రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సబర్మతి ఆశ్రమం నిర్మించారు.



మల్బరీ సాగులో విద్యార్థులు

చారిత్రక ప్రదేశాల సందర్శనతో మనోవికాసం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: మన చుట్టూ ఉన్న చారిత్రక ప్రదేశాలను తప్పక సందర్శించాలి. పర్యాటక ప్రాంతాల సందర్శన మనసుకు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుందని డా.బాబు జగ్జీవన్‌రామ్ చర్మ పరిశ్రమ అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, పర్యాటక శాఖ, హోటల్ యజమానుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని చారిత్రక కోట ఎదురుగా శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన హంపీ, తుంగభద్ర జలాశయం అందాలు బళ్లారి జిల్లాను వేరు చేశాయి. మన జిల్లాలో సండూరులోని కుమారస్వామి దేవస్థానం, స్వామిమలై ప్రకృతి అందాలు, నారిహళ్లి జలాశయం, బళ్లారి ఏకశిల కొండ, మించేరి కొండపై ప్రకృతి అందాలు, సంగనకల్లులోని శిలాయుగం నాటి ప్రాంతాలు, సిరుగుప్పలోని కెంచనగుడ్డ, కురుగోడులో దొడ్డ బసవేశ్వర దేవస్థానం వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. రేడియోపార్క్‌లోని డైట్ కళాశాలలో మహాత్మాగాంధీ చితాభస్మం స్మారకం, రైల్వే స్టేషన్‌లో గాంధీ విశ్రాంతి తీసుకున్న ప్రదేశం, సండూరు తాలూకాలోని ప్రకృతి అందాలను చూడాలని గుర్తుచేశారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ ఉమ్మడి బళ్లారి జిల్లాలో ప్రపంచ పర్యాటక ప్రాంతమైన హంపీ విజయనగర జిల్లాలోకి వెళ్లినా..బళ్లారి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర మాట్లాడారు. అధికారులు రవీంద్ర, హోటల్ సంఘం అధ్యక్షులు విక్రమ్ పోలా, కన్నడ సాంస్కృతిక శాఖాధికారి నాగరాజ, శ్రీహరి మాసనూరు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బీటీపీఎస్ కార్మికుల సమస్యలపై స్పందన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా కుడతిని థర్మల్ విద్యుత్తు ప్లాంట్ కార్మికులు కనీస వేతనం ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కార్మికర హిత రక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్లాంట్ ముందు చేస్తున్న ఆందోళన విషయం తెలుసుకున్న కలబురగి ప్రాదేశిక కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్ స్పందించారు. గురువారం సాయంత్రం ఆందోళన చేస్తున్న కార్మికల వద్దకు చేరుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమితి అధ్యక్షుడు విఠలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులకు ఒప్పందం ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కమిషనర్ స్పందించి కార్మికుల సమస్యలు నిర్దిష్ట సమయంలోపు పరిష్కరిస్తానని రాతపూర్వక హామీ ఇచ్చారు. సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటరమణ బాబు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో యువతి మృతదేహం లభ్యం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బళ్లారికి చెందిన ఇందుప్రియ (25) మృతదేహం బొమ్మనహాళ్ సమీపంలో శుక్రవారం లభ్యమైంది. బళ్లారి పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. బళ్లారి సమీపంలోని బండి హట్టివద్ద హెచ్చెల్సీలో గల్లంతైన ఇందుప్రియ మృతదేహం బొమ్మనహాళ్ సమీపంలోని ఆంధ్ర సరిహద్దులో లభ్యమైంది. గత మంగళవారం అదృశ్యమైనట్లు బళ్లారి మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. వీరేశ్ అనే యువకుడితో కలిసి వెళ్లారని, వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్లు గుర్తించారు. యువకుడిది కర్నూలు జిల్లా హాలహర్వి మండలం చింతకుంట సమీపంలోని మల్లికార్జునపల్లి అని పోలీసులు భావిస్తున్నారు.

బళ్లారిలో 'దేవర' సందడి

బళ్లారి, న్యూస్‌టుడే: తెలుగు స్టార్ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర-1 చిత్రం శుక్రవారం బళ్లారి నగరంలో మూడు సినిమా థియేటర్లలో విడుదలైంది. చాలా రోజుల తర్వాత ఆయన సినిమా విడుదల కావడంతో అభిమానులు ఒక్కసారిగా తరలిరావడంతో నియంత్రణ చేయడం పోలీసులతో పాటు థియేటర్ సిబ్బందికి కష్టమైంది. అభిమానులు తోపులాటలో గేటును పడిపోయింది. గురువారం సాయంత్రం బళ్లారి నగరంలో అభిమానులు కార్లు, బైక్ ప్రదర్శన నిర్వహించారు.

విద్యాశాఖ కార్యాలయంలో అవినీతిని అరికట్టండి



ఉద్యోగులు లంచం అడిగిన వీడియో తాలూకా సీడీని ప్రదర్శిస్తున్న ప.య.గణేశ్

హొసపేటె, న్యూస్‌టుడే: బయట జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సొంత జిల్లాకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసే ప్రక్రియలో బళ్లారి, విజయనగర జిల్లా విద్యా శాఖ అధికారుల కార్యాలయాల్లో అవినీతి చోటు చేసుకుందని అవినీతి నిర్మూలన కర్ణాటక సంఘం అధ్యక్షుడు ప.య.గణేశ్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి జిల్లాలో పని చేసే సుమారు 200 మంది ఉపాధ్యాయులు సొంత జిల్లా విజయనగరకు ఇటీవలే బదిలీపై వచ్చారు. ఉమ్మడి జిల్లా కేంద్రం బళ్లారిలో బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. స్థానాలను ఎంపిక చేసుకున్న ఉపాధ్యాయులకు రిలీవింగ్ లేఖ ఇవ్వటానికి బళ్లారి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డబ్బులు వసూలు చేశారు. మూవ్‌మెంట్ ఉత్తర్వు ఇవ్వటానికి విజయనగర జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలోనూ డబ్బులు వసూలు చేశారని స్పష్టం చేశారు. లంచం అడుగుతున్న, తీసుకుంటున్న దృశ్యాలను వీడియో తీయించామని వివరించారు. దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా పాలనాధికారి, జడ్పీ సీఈవోకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. బళ్లారి కార్యాలయంలో ఓ ఉద్యోగి, విజయనగర కార్యాలయంలో ఓ అపరిచితుడు మధ్య ప్రవేశించి లంచం తీసుకున్నట్లు తమ వద్ద వీడియో దాఖలాలు ఉన్నాయని తెలిపారు. సంఘం ప్రముఖులు వరుణ్ తోరణగట్టె, దల్లాళి హుసేన్ మౌలా పాల్గొన్నారు.

హొసపేటె తహసీల్దార్‌కు పురస్కారం



బెంగళూరులో మంత్రి కృష్ణభైరేగౌడ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న హొసపేటె తహసీల్దార్ శ్రుతి మళ్లప్ప గౌడ్రు

హొసపేటె, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖ ఏటా అందిస్తున్న అత్యుత్తమ రెవెన్యూ అధికారి పురస్కారం 2023-24వ సంవత్సరానికి గాను హొసపేటె తహసీల్దార్ శ్రుతి మళ్లప్ప గౌడ్రుకు దక్కింది. ఆమె కొప్పళ జిల్లా కుష్టగి తహసీల్దార్‌గా ఉన్నప్పుడు అందించిన సేవలకుగాను ఈ పురస్కారం అందుకున్నారు. రెవెన్యూ శాఖ సేవలను ప్రజల చెంతకు చేరవేయడం, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఉత్తమ సేవలందించినందుకు తహసీల్దార్ స్థాయి అధికారుల విభాగంలో ఆమెకు అత్యుత్తమ రెవెన్యూ అధికారి పురస్కారం దక్కింది. శుక్రవారం బెంగళూరు వికాససౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ఆ శాఖ మంత్రి కృష్ణభైరేగౌడ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. ఆరు నెలల క్రితం ఆమె కుష్టగి నుంచి హొసపేటెకు బదిలీపై వచ్చారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి



అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను సత్కరిస్తున్న చేనేత సమాజబాంధవులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘంలో నేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బళ్లారి చేనేత సహకార ఉత్పత్తుల సంఘం నూతన అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం సహకార సంఘం భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించేందుకు నావంతు పాటుపడతానన్నారు. సంచాలకులు, పెద్దల సహకారంతో సంఘం ఉన్నతికి సేవలందిస్తానని చెప్పారు. మూడోసారి అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్న సంచాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణను విరుపాక్షప్ప, మంజునాథ్, రంగస్వామి, కిరణ్, బ్రహ్మయ్య తదితరులు అభినందించారు. ప్రముఖులు మురళీ, కిరిటప్ప, వద్దిళ్ల లక్ష్మీదేవి, ఓభుళపతి, వీరేష్, మారెప్ప, నాగప్పయాదవ్, గురుస్వామి, జింకా లక్ష్మీదేవి, రాజ పాల్గొన్నారు.

చరిత్రపుటల్లో సమస్యలకు పరిష్కార మార్గాలు



మాట్లాడుతున్న హంపీ కన్నడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.పరమశివమూర్తి

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు చరిత్ర పుటల్లో పరిష్కార మార్గాలున్నాయని, వాటిని అధ్యయనం చేసి తెలుసుకొనే ఓర్పు నేటి తరానికి లేదని హంపీ కన్నడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. పరమశివమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మయూర వర్మ పాలనపై ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ యాంత్రికంగా, ఒత్తిడితో జీవనం చేయాల్సి వస్తోందన్నారు. సామాజిక సమస్యలు జటిలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ చరిత్ర, సంస్కృతి ఎంతో మేలైందని, మన పూర్వికులు అనేక అనుభవాలతో మార్గదర్శకాలను చరిత్ర పుటల్లో లిఖించారన్నారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు సుజాత, ప్రధాన కార్యదర్శి డా. రాజీవలోచన, జిల్లా విద్యాశాఖ అధికారి, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ లీలావతి, శిలాశాసనాల పరిశోధకులు డా. బి.ఆర్.రాజశేఖరప్ప, డా. యశోధ, మారుతి మోహన్ పాల్గొన్నారు.

పెద్దవాగు వంతెన నాణ్యతపై అనుమానం



వినతిపత్రం సమర్పిస్తున్న రక్షణా వేదిక కార్యకర్తలు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు పట్టణ నడిబొడ్డున పెద్దవాగుపై జాతీయ రహదారి అభివృద్ధి నిధులతో నిర్మించిన వంతెన ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకుండానే భారీ బీటలు పడటం అనుమానాలకు తావిస్తోంది..దీనిపై తక్షణం పరిశీలన జరపాలని కర్ణాటక రక్షణా వేదిక కార్యకర్తలు శుక్రవారం జాతీయ రహదారుల ప్రాధికార అధికారులను కోరారు. ప్రారంభోత్సవం జరిగిపోయినా..ఈ వంతెన పనులు ఇంకా చాలా శాతం మిగిలిపోయాయి. వంతెన అడుగున పెద్దస్థాయి బీటలు తేలాయని, 500 మీటర్ల మేరకు జాయింట్లు వదిలేశాయని తెలిపారు. ఈ పనులపై కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేశారు. ఇది ప్రజలకు ప్రమాదకరం అని నిరసన ప్రదర్శన చేశారు. దీని నిర్మాణానికి వెచ్చించిన రూ.కోట్ల నిధులు గంగపాలేనా అని ప్రశ్నించారు. సింధనూరుకు నేటికీ బైపాస్ సదుపాయం లేదు. భారీ వాహనాలన్నీ ఇదే వంతెన మీదుగా వెళ్లాలి..ఈ వంతెన పనులు చూస్తే నాసిరకంగా జరిగి ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నాయి..దీనిపై తక్షణం నిగ్గు తేల్చాలని జాతీయ రహదారుల ప్రాధికారను కోరారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. కరవే జిల్లా అధ్యక్షుడు గంగణ్ణ, ఉపాధ్యక్షుడు దేవేంద్ర గౌడ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ భజంత్రీ, తాలూకా అధ్యక్షుడు లక్ష్మణ భోవి పాల్గొన్నారు.

క్రీడలతో బహుముఖ ప్రతిభ వెలుగులోకి



స్టేడియంలో క్రీడోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి, మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ తదితరులు

సింధనూరు, న్యూస్‌టుడే: చదువు ఒక్కటే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థులు బహుముఖ ప్రతిభవంతులు కావొచ్చని సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్టేడియంలో జిల్లా విద్యాశాఖ, స్థానిక అనికేతన కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయచూరు జిల్లాస్థాయి జూనియర్ కళాశాల విద్యార్థుల క్రీడాపోటీల ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలే అనుకుంటే భవిష్యత్తు జీవనం అంధకారం అవుతుంది. చదువుకు జతగా క్రీడల్లో రాణిస్తే ఉత్తమంగా ఎదుగుతారని కళాశాల విద్యార్థులకు వివరించారు. మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ మాట్లాడుతూ ఆటల్లో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించమని సూచించారు. కార్యక్రమానికి అనికేతన కళాశాల అధ్యక్షుడు డీహెచ్.కంబళి అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప, జూనియర్ కళాశాలల జిల్లా విద్యాశాఖాధికారి జయరామయ్య పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ప్రగతి సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కర్ణాటక విధానమండలి దళిత, గిరిజన వర్గాల కల్యాణ సమితి అధ్యక్షుడు పి.ఎం.నరేంద్రస్వామి, సభ్యులు, అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: దళిత, గిరిజన సముదాయంలో అత్యంత వెనకబడిన వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందజేసి వారి జీవితాల్లో వెలుగును ప్రసాదించడానికి అధికారులు శ్రమించాలని కర్ణాటక విధానమండలి దళిత, గిరిజన వర్గాల కల్యాణ సమితి అధ్యక్షుడు పి.ఎం.నరేంద్రస్వామి సూచించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ ఆవరణలోని నజీర్ సభా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళిత, గిరిజన వర్గాలు అత్యంత వెనకబడిన ప్రాంతమైన కల్యాణ కర్ణాటకలో అధికారులు పనిచేస్తున్నారు. సామాజిక ఆందోళనలకు బాధ్యత వహించండి. సమాజంలో అందరితో పాటు సమానంగా జీవనం సాగించేలా శ్రమించాలన్నారు. జిల్లాలో అన్ని శాఖల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రిజర్వేషన్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మాజీ దేవదాసీలకు పునరావాసం, కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇళ్లు లేని వారికి వివిధ పథకాల కింద పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. పదోతరగతిలో ఉత్తీర్ణత శాతం పెరగాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రభుత్వ పాఠశాలకు నియమించే ఎస్‌డీఎంసీ సమితులను ఏర్పాటు చేయాలన్నారు.



సమాధానం ఇస్తున్న అధికారులు, చిత్రంలో జిల్లా, తాలూకా స్థాయి అధికారులు

జనాభా ఆధారంగా లబ్ధి

2011 జనగణన ప్రకారం జిల్లాలో మొత్తం 14,00,970 జనాభా ఉండగా, వారిలో దళిత పురుషులు 1,33,180 మంది, మహిళలు 1,34,213 మంది, గిరిజన పురుషులు 1,31,119 మంది, మహిళలు 1,31,553 మంది జీవనం సాగిస్తున్నారని అధికారులు సమాధానం ఇచ్చారు. మూడేళ్లలో 65 దౌర్జన్యాలు జరిగినట్లు కేసులు నమోదయ్యాయి. 127 మందికి పరిహారం అందజేసినట్లు అధికారులు వివరించారు. జిల్లాలో అటవీ సంరక్షణ సమితిని ప్రారంభించి పునర్వసతి పథకం కింద పథకాలు అందజేస్తున్నట్లు అటవీశాఖాధికారులు సమాధానం ఇచ్చారు. దీనిపై సమితి అధ్యక్షుడు నరేంద్రస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనులు కేటాయించాలి

ప్రజాపనుల శాఖ, నీటిపారుదల, జెస్కాం, పీఆర్‌ఈడీ స్థానిక సంస్థలోని వివిధశాఖల కింద చేస్తున్న సివిల్, మౌలిక సౌకర్యాలు పనుల్లో రూ.కోటి వరకు పనులను ఎస్సీ, ఎస్టీ గుత్తేదారులకు అవకాశం కల్పించాలని సూచించారు. కల్యాణ సమితి సభ్యులు గోవిందప్ప, ఐహొళ దుర్యోధన, కృష్ణనాయక, కరెమ్మ, శాంతరామ్ బుడ్డ సిద్ధి, జగదేవ్ గుత్తేదార్, విధానసభ ఆధీన కార్యదర్శి పి.సీన, సమాజ కల్యాణ శాఖ కమిషన్ రాకేశ్‌కుమార్, జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పోలీస్ అధికారి శోభారాణి, జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాదనహట్టిలో గ్రంథాలయం ఏర్పాటు

కురుగోడు తాలూకా బాదనహట్టి గ్రామంలోని శివశరణ హంపమ్మ మఠంలో గ్రంథాలయాన్ని గ్రామపంచాయతీ అధ్యక్షుడు కరియప్ప శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సామాజిక పరిజ్ఞానం పెంచుకోవడానికి ఈ గ్రంథాయం ఉపయోగపడుతుందన్నారు. స్థానిక ప్రజలతో పాటు విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి నిర్మల, శివరామరెడ్డి, పూజారి యల్లేశ, జీపీ ఉపాధ్యక్షురాలు మేటి కరిబసమ్మ, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి రామలి తదితరులు పాల్గొన్నారు - న్యూస్‌టుడే, బళ్లారి



రేపు వీఏఓ ఉద్యోగాల భర్తీకి పోటీ పరీక్షలు

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామ పాలనాధికారి (వీఏఓ) ఉద్యోగ స్థానాల భర్తీకి 29న విజయనగర జిల్లాలో జరుగుతున్న పోటీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు తాలూకాలు కలిపి మొత్తం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. హొసపేటె-14, హగరిబొమ్మనహళ్లి-5, కూడ్లిగిలో-3 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్లు నిషేధాజ్ఞలు విధించామని చెప్పారు. జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేస్తున్నాం. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ముగ్గురు జిల్లా స్థాయి అధికారులను పర్యవేక్షకులుగా నియమించామని తెలిపారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

3 నుంచి హులిగమ్మదేవి దసరా ఉత్సవాలు



హులిగిలో వెలసిన హులిగమ్మదేవి

గంగావతి,న్యూస్‌టుడే: హులిగమ్మదేవి దసరా ఉత్సవాలను అక్టోబరు 3 నుంచి 12 వరకు దేవాదాయ శాఖ ఆచరిస్తోందని ఆలయ అభివృద్ధి మండలి కార్యదర్శి ఎం.హెచ్.ప్రకాశ్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. 3న ఘట స్థాపనతో శ్రీకారం చుడతారన్నారు. నిత్యం సాంస్కృతిక ప్రదర్శనలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 10న దుర్గాష్టమి, సరస్వతి పూజ, 11న మహానవమి, ఆయుధపూజ, గజవాహన పూజలు ఆచరిస్తారన్నారు. 12న మధ్యాహ్నం దేవీ దశమి దిండి ఉత్సవంలో శమీ వృక్షం వద్దకు వెళ్లి పూజలు చేస్తారన్నారు.

ప్రతి కదలిక.. కనిపెట్టేస్తుంది పక్కా!

● పాలికెలో వ్యర్థాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ● అక్రమాలకు అడ్డుకట్ట



ఆటో టిప్పర్‌కు అమర్చిన జీపీఎస్

బళ్లారి, న్యూస్‌టుడే: నేను ఫలానా కాలనీలో ఇంటింటా వ్యర్థాలు సేకరిస్తున్నా.. నిత్యం వాటిని సేకరించడానికి 50 కిలోమీటర్లకు పైగా తిరిగాను.. ఉదయం 5.30 గంటలకే పనిలో ఉన్నా.. అంటూ సిబ్బంది చెప్పే తప్పుడు లెక్కలతో పాలికె ఖజానాకు గండిపడుతోంది. ఎక్కువ సార్లు ట్రిప్పులు తిప్పానంటూ మాయ చేసి బిల్లుల రూపంలో సొమ్ము దోచేద్దామంటే ఇక కుదరదు. అదెలాగంటే.. బళ్లారి నగరపాలికె నూతనంగా ఏర్పాటు చేసిన జీపీఎస్ సాంకేతిక వ్యవస్థ ఆధారంగా వీటికి అడ్డుకట్ట వేస్తున్నారు. నగర పాలికె అధికారులు వ్యర్థాలు తొలగించే ఆటో టిప్పర్లు, ట్రిక్టర్లు, కంప్రెసర్ లారీలు, జేసీ, ట్రాక్టర్లపై ప్రత్యేక నిఘా పెట్టడానికి జీపీఎస్ అమర్చారు. నిబంధనలు ఉల్లంఘించే చోదకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

125 వాహనాలకు అనుసంధానం

బళ్లారి నగర పాలికె 84 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించింది. మొత్తం 39 వార్డులున్నాయి. నగర జనాభా 7.50 లక్షలు. నిత్యం నగరానికి వచ్చి పోయే వారు 30 వేల నుంచి 40 వేల మంది ఉంటారు. రోజూ నగర పాలికెలో 250 టన్నుల వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇంటింటికీ వ్యర్థాలు సేకరించడానికి ఆటోటిప్పర్లు, చిన్న చిన్న ట్రాక్టర్లు, మురుగు కాలువల్లో పూడికను తొలగించడానికి జేసీబీలు, వ్యర్థాలను వేణివీరాపురం సమీపంలోని డంపింగ్ యార్డ్‌కు తరలించే కంప్రెసర్ వాహనాలు సుమారు 200కుపైగా ఉన్నాయి. వాటిలో మొదట విడతలో ఆటో టిప్పర్లు, చిన్న ట్రాక్టర్లు, కంప్రెసర్ వాహనాలు 125కు జీపీఎస్‌ను అమర్చారు. వాటిని పరిశీలించడానికి నగర పాలికె కార్యాలయంలో నియంత్రణ గదిని ఏర్పాటు చేసి 24 గంటలపాటు పర్యవేక్షణ, సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు.



జీపీఎస్ ద్వారా వాహనాల సంచారాన్ని గుర్తిస్తున్న అధికారి

అవకతవకల నివారణకు చర్యలు

నగర పాలికెలో సుమారు 200కుపైగా వాహనాలు ఉన్నాయి. వాటికి నిత్యం డీజిల్, నిర్వహణ ఖర్చులు నెలకు రూ.50లక్షల వరకు ఖర్చు వస్తోంది. జీపీఎస్ ద్వారా ఖర్చులను తగ్గించడంతో పాటు అక్రమాలను నివారించడానికి జీపీఎస్ దోహదం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇంటింటి వ్యర్థాలు సేకరిస్తున్నారా. .కేటాయించిన ప్రాంతాలకు వెళ్తున్నారా.. ఎక్కువ సేపు ఒకేచోట నిలబెట్టి సమయం వృథా చేస్తున్నారా? ఎన్ని గంటలకు విధులకు హాజరయ్యారు. ఎన్ని గంటలు విధుల్లో ఉన్నారు? వంటి వాటిని జీపీఎస్ నియంత్రణ గది నుంచి పరిశీలిస్తారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు.



జీపీఎస్ ద్వారా వాహనాల పరిశీలన



వ్యర్థాలను ఆటో టిప్పర్ వేస్తున్న ప్రజలు

వాహనాలపై నిఘా



పాలికెలో వ్యర్థాలు సేకరించే వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను అనుసంధానం చేయడంతో వాహనాల రాకపోకలను పర్యవేక్షణ సులభంగా మారింది. ఇంతకుముందు పరిశీలించడానికి సిబ్బంది కొరతతో ఈ ప్రక్రియ కష్టంగా ఉండేది. జీపీఎస్‌తో ఈ కష్టాలకు చెక్ పెట్టేస్తున్నాం. ప్రస్తుతం 125 వాహనాలకు జీపీఎస్‌ను ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో నగర పాలికెలోని అన్ని వాహనాలకు అమర్చే ఆలోచన ఉంది.

- కిరణ్, నగర పాలికె జీపీఎస్ బాధ్యుడు

కబడ్డీలో వైజేర్ విద్యార్థుల విజయం



జిల్లాస్థాయి కబడ్డీ విజేత వైజేఆర్ కళాశాల జట్టు

గంగావతి,న్యూస్‌టుడే: పీయూ కళాశాలల కొప్పళ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో గంగావతి యలమంచిలి జనతారాణి కళాశాల విద్యార్థుల జట్టు ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ఈ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల అధ్యక్షుడు కల్యాణం జానకీరాం తెలిపారు. తాలూకా స్థాయిలో సైతం ఈ బృందం ప్రథమ స్థానం పొందిన విషయాన్ని గుర్తుచేశారు.

దేవలాపుర బాలికల జట్టు సత్తా



బాలికల జట్టు సభ్యులకు ప్రమాణ పత్రాలు అందించిన ఉపాధ్యాయులు

కంప్లి, న్యూస్‌టుడే: కబడ్డీలో దేవలాపుర బాలికల జట్టు జిల్లా పోటీలకు ఎంపికైంది. కంప్లిలో శుక్రవారం జరిగిన తాలూకా పోటీల్లో ఈ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించింది. కంప్లి విద్యాసాగర వసతి పాఠశాల విద్యార్థులు బాలురు, బాలికల షటిల్ కాక్‌లో ప్రథమ, బాలికల జట్టు వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించాయి. ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

నేడు అత్యవసర వైద్య విభాగ నిర్మాణానికి భూమిపూజ

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణం పరిధి సండూరు మార్గంలో 50 పడకల అత్యవసర వైద్య విభాగం (క్రిటికల్ కేర్ యూనిట్) నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గవియప్ప భూమి పూజ చేయనున్నారని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూ.28.52 కోట్లను విడుదల చేసిందని వివరించారు. అన్ని వ్యాధులకు సంబంధించి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులను ఇక్కడ దాఖలు చేసుకుని చికిత్స అందించడమే ఈ కేంద్రం ఉద్దేశమని పేర్కొన్నారు. సండూరు మార్గంలో నిర్మాణదశలో ఉన్న జిల్లాసుపత్రి ఆవరణలోనే ఈ కేంద్రానికీ స్థలం కేటాయించారని చెప్పారు.

ప్రైవేటు బస్సు ఢీకొని బైకు చోదకుడి దుర్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సు ఢీకొని బైకు నడుపుతున్న మరిస్వామి (23) అనే యువకుడు ప్రమాద స్థలంలో మృతిచెందిన ఘటన గురువారం రాత్రి హగరిబొమ్మనహళ్లి తాలూకా వల్లభాపుర మార్గంలో జరిగింది. తంబ్రహళ్లికి చెందిన మరిస్వామి, తన స్నేహితుడు చారెప్పను తోడుకుని బైకుపై ముత్కూరులోని తమ బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి స్వస్థలం వస్తుండగా ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. ఈ ఘటనపై హగరిబొమ్మనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మద్య వ్యతిరేక శిబిరం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి కెరె బసవేశ్వర కల్యాణ మంటపంలో శనివారం నుంచి అక్టోబరు 6 వరకు మద్య వ్యతిరేక శిబిరం జరగనుందని ధర్మస్థల గ్రామాభివృద్ధి బీసీ ట్రస్టు యోజన అధికారి నింగప్ప అగసర తెలిపారు. వివిధ సంఘ సంస్థల సహకారంతో స్థానిక ప్రగతిబంధు స్వసహాయ సంఘాల సమాఖ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇది రాష్ట్రంలో ఇది ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన 1,864వ మద్య విసర్జనా శిబిరమని తెలిపారు.

పంచాయతీ మేనేజర్‌పై వేటు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: మొలకాల్మూరు తాలూకా పంచాయతీ కార్యాలయ మేనేజర్ అరుణ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలపై జడ్పీ సీఈవో సోమశేఖర్ ఆయన్ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. అరుణ్‌కుమార్ గత నెల 8 నుంచి 21 వరకు ఉన్నత అధికారుల అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరయ్యారన్నారు. ఈ విషయంపై తాఖీదు జారీ చేసి విచారణ జరిపిన తాలూకా పంచాయతీ ఈవో నివేదిక అందించడంతో అరుణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగులనూ పట్టించుకోండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంచాలకుడు హుల్లుబసప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల వైపు కాస్త కన్నెత్తి చూడాలి. 7వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు తమకు అందాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం వివక్ష ధోరణి ప్రదర్శిస్తోందని కర్ణాటక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సంచాలకుడు హుల్లుబసప్ప వాపోయారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 జులైలోనే 7వ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మార్చిలో నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. ఆగస్టు 1 నుంచి దానిని అమల్లోకి తీసుకొస్తున్నారు. 2022 నుంచి 2024 జులై మధ్యలో పదవీ విరమణ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు పింఛను మాత్రమే పెంచారు.. గ్రాట్యుటీ, మిగులు సెలవు నగదీకరణ ఇతర సౌకర్యాలు ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. అక్టోబరు 1న అన్ని జిల్లాల పాలనాధికారి కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్నామని వివరించారు. ప్రముఖులు టి.కె.వెంకటేశ్‌రెడ్డి, కె.కొట్రేశ్, కడ్డి వీరభద్ర, బసవరాజ్ పాల్గొన్నారు.

ముత్తుగదూరు చెరువుకు తుంగభద్ర జలాలు



చెరువుకు పైపుల ద్వారా నీరు చేరడాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రప్ప, కేంద్ర మాజీ మంత్రి సిద్ధేశ్వర్, సిరిగెరె పీఠాధిపతి డా.శివమూర్తి శివాచార్య స్వామి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: సాస్వేహళ్లి ఎత్తిపోతల పథకం నుంచి తుంగభద్ర నదీ జలాలను పైపుల ద్వారా ముత్తుగదూరు చెరువుకు తరలించి భర్తీ చేస్తే భూగర్భ జలాలు పెరిగి పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల రైతులకు ఊరట లభిస్తుందని హొళల్కెరె ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తాలూకాలోని ముత్తుగదూరు చెరువుకు తుంగభద్ర జలాలు తరలించడాన్ని పరిశీలించి మాట్లాడారు. బి.ఎస్.యడియూరప్ప, బసవరాజ బొమ్మై ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు రూ.680 కోట్లతో మంజూరైన ఎత్తిపోతల పథకాలు నేడు వేలాదిమంది రైతులకు నీరు అందిస్తున్నాయన్నారు. జిల్లాలో పలు ఎత్తిపోతల పథకాల మంజూరులో డా. శివమూర్తి శివాచార్య స్వామి పాత్ర కీలకమన్నారు. తాలూకాలో సీసీ దారుల నిర్మాణానికి రూ.105 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి జి.ఎం. సిద్ధేశ్వర్, సిరిగెరె పీఠాధిపతి డా. శివమూర్తి శివాచార్య స్వామి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే యత్నాళ్ సభ్యత్వాన్ని రద్దుచేయాలి'

మాన్వి, న్యూస్‌టుడే : విజయపుర ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ముస్లిం సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 19న ముదోళ్ పట్టణంలో జరిగిన ఓ బహిరంగ సభలో ఎమ్మెల్యే టిప్పుసుల్తాన్‌పై ఎమ్మెల్యే తీవ్రవ్యాఖ్యలు, హేళన చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ముస్లిం సంఘాలు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. టిప్పు సుల్తాన్ కూడలి నుంచి ప్రముఖ వీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, ప్రముఖులు ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ఆయనను శాసన సభ్యత్వాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. యత్నాళకు వ్యతిరేకంగా ఆందోళన కారులు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు సయ్యద్ హుసేన్, మహ్మద్ రెహమత్ అలి, సయ్యద్ సజ్జాద్ హుసేని, ఇస్మాయిల్, సాధిక్ హుసేన్ ఖురేషీ, జాగీర్ సాహెబ్‌గురు, సయ్యద్ ముస్తాక్‌ఖాద్రి, నాసిర్ అలి, జిలానీ కురేషీ, హాకీం కురేషీ, జావిద్‌ఖాన్, ముస్లిం యువకులు పాల్గొన్నారు.



ముస్లింల నిరసన ప్రదర్శన

ముగ్గురు తహసీల్దార్లకు అవార్డులు



కృష్ణబైరేగౌడ నుంచి అవార్డులు అందుకొంటున్న తహసీల్దార్లు

మాన్వి, న్యూస్‌టుడే : ఉత్తమ పనితీరు కనబరిచిన మాన్వి తహసీల్దార్ రాజు ఫిరంగి, సిరివార తహసీల్దార్ రవి ఎస్ అంగడి, బాదామి తహసీల్దార్ జె.బి.మజ్జిగి ఉత్తమ తహసీల్దార్లుగా అవార్డులకు ఎంపికైన విషయం తెలిసిందే. శుక్రవారం బెంగళూరు వికాస్‌సౌధలో రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ చేతుల మీదుగా పలువురు జిల్లా పాలనాధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు అవార్డులు అందుకున్నారు. రాయచూరు జిల్లాకు చెందిన ముగ్గురి తహసీల్దార్లు అవార్డులు అందుకోవడంపై రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కంప్లిలో రేబిస్ జాగృతి కార్యక్రమం



రేబిస్ గురించి వివరిస్తున్న వైద్యుడు

కంప్లి, న్యూస్‌టుడే: విశ్వ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంప్లి సముదాయ ఆసుపత్రి శుక్రవారం జాగృతి కార్యక్రమం నిర్వహించింది. ఆసుపత్రి నుంచి ప్రారంభమైన జాతా పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. రేబిస్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్స గురించి వైద్యులు ప్రజలకు వివరించారు. వివిధ శాఖల సహకారంతో సముదాయ ఆసుపత్రి ఈ కార్యక్రమం నిర్వహించింది. వైద్యాధికారి రవీంద్ర కనికేరి, వైద్యులు భరత్ పద్మశాలి, మల్లేశప్ప, విశ్వనాథ, ఉషా, నిహారిక, క్షేత్ర ఆరోగ్య శిక్షణ అధికారిణి కె.శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణం నేడు

జంగమర కల్గుడి (శ్రీరామనగర్), న్యూస్‌టుడే: గంగావతి తాలూకా జంగమర కల్గుడిలోని కోదండ రామాలయంలో శనివారం శ్రీనివాస కల్యాణం జరగనుంది. ఉదయం గజ్జె పూజ, స్వామి వారికి అభిషేకం, మధ్యాహ్నం శోభాయాత్ర, రాత్రి శ్రీనివాస కల్యాణం, అన్న సంతర్పణ ఉంటాయని హరే శ్రీనివాస కోలాట బృందం సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.



జంగమరకల్గుడిలోని కోదండ రామాలయం

బోధనా విధానంపై అవగాహన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ప్రాధ్యాపకుడు డాక్టర్ శివానంద్

హొసపేటె, న్యూస్‌టుడే: పాఠశాలల్లో గురుశిష్యుల నడుమ సంబంధాలు ఎలా ఉంటాయో, దానిపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని స్థానిక విజయనగర కళాశాల విశ్రాంత ప్రాధ్యాపకుడు డాక్టర్ ఎస్.శివానంద్ పేర్కొన్నారు. విజయనగర జిల్లా కన్నడ వేదిక, పీయూ విద్యాశాఖలు సంయుక్త ఆధ్వర్యంలో 'బోధన విధానం' అనే అంశంపై శుక్రవారం బాలికల కళాశాలలో ఉపన్యాసకులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గురుశిష్యుల సంబంధంపై క్రీ.శ.12వ శతాబ్దంలోనే బసవణ్ణ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. గురుశిష్యుల సంబంధాలు తరగతి గదులకే పరిమితం కాకూడదని తెల్పి చెప్పారు. ఆ విలువలను ఉపన్యాసకులు, విద్యార్థులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వేదిక అధ్యక్షుడు డాక్టర్ దయానంద్ కిన్నాళ, ప్రధానాచార్యుల సంఘం అధ్యక్షుడు నాగరాజ్ హవాల్దార్, కళాశాల ప్రధానాచార్య శ్రీధర్, వేదిక గౌరవాధ్యక్షుడు సిద్ధరామ హిరేమఠ్, రామణ్ణ కల్యాణదవర్, కె.ఎం.జయణ్ణ, గూళప్ప హులమని పాల్గొన్నారు.


తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.83	1619.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	15,135	1,230
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	15,228	9,606
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.109	58,780

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మైసూరు చిత్రకళా శిబిరానికి మాన్వి కళాకారులు



చిత్రకళా కళాకారుడు వాజిద్

మాన్వి, న్యూస్‌టుడే : మైసూరు దసరా మహోత్సవ చిత్రకళా శిబిరంలో పాల్గొనాల్సిందిగా మాన్వి పట్టణానికి చెందిన చిత్రకళాకారులు వాజిద్, సాజిద్‌లకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. మైసూరు చిత్రకళా కళాశాల (కావా)లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3వరకు శిబిరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కళాకారులు హాజరవుతారు. ఈ శిబిరంలో 3×3 సైజులో ఓ కళాకృతిని రూపొందించాల్సి ఉంటుందని కర్ణాటక లలితకళా అకాడమీ రిజిస్ట్రార్ బి.నీలమ్మ తెలిపారు. దసరా మహోత్సవ చిత్రకళా శిబిరానికి మాన్వి కళాకారులకు అవకాశం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విశ్వకర్మ సమాజం సంఘటితం కావాలి

గంగావతి,న్యూస్‌టుడే: విశ్వకర్మ వర్గం సంఘటితమై హక్కులు సాధించుకోవాలని సంఘం జిల్లాధ్యక్షుడు నాగేశ్‌కుమార్ కోరారు. గంగావతి వడ్డరహట్టి ఉళ్ళిడగ్గిలో శుక్రవారం ఆచరించిన విశ్వకర్మ జయంతిలో పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ ఈ వర్గాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రముఖులు ఈశ్వరప్ప, హనుమేశ్ బడిగేర్, కాళేశ్ బడిగేర్, మౌనేశ్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వకర్మ సంఘం జిల్లాధ్యక్షుడు నాగేశ్‌కుమార్

గ్రామ పాలనాధికారులపై వివక్ష ధోరణి

హొసపేటె, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పనిచేస్తున్న పాలనాధికారులపై ప్రభుత్వం వివక్ష ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ శుక్రవారం జిల్లాలోని గ్రామ పాలనాధికారులు, సిబ్బంది విజయనగర జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన యంకారెడ్డి, గురుబసవరాజ్ తదితరులు మాట్లాడుతూ గ్రామ పాలనాధికారి (వీఏఓ)లకు ఇప్పటి వరకు గ్రామాల్లో సరైన కార్యాలయాలు లేవని వాపోయారు. కొన్ని చోట్ల భవనాలను అద్దెకు తీసుకుని కార్యాలయాలను నడుపుతున్నాం. అధికారులకు సహాయక సిబ్బందిని నియమించకపోవడంతో, కార్యాలయంలో అన్ని పనులను వీఏఓలే చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు.



జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ పాలనాధికారులు, సిబ్బంది

గ్యారంటీలతో ఆర్థిక చేయూత

గంగావతి,న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఐదు గ్యారంటీలు ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు చేయూతగా నిలిచాయని కొప్పళ లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కొప్పళ తాలూకా అళవండిలో గ్యారంటీ లబ్ధిదారుల సంవాద కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ పథకాలతో ప్రభుత్వం ఉద్దేశం నెరవేరిందా? లేదా అన్నది తెలుసుకునేందుకు గ్రామాల్లో లబ్ధిదారులతో సంవాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్యారంటీలు వంచిత లబ్ధిదారులను గుర్తించి వారికి వీటిని అందజేయడమే లక్ష్యమన్నారు. జిల్లా ప్రాధికార అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, కొప్పళ తాలూకా అధ్యక్షుడు బాలచంద్ర, సభ్యులు జ్యోతి గొండబాళ, అన్వర్, అన్నదానస్వామి, బాషా పాల్గొన్నారు.



గ్యారంటీ లబ్ధిదారుల సంవాద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లోక్‌సభ సభ్యుడు రాజశేఖర హిట్నాళ

ఒత్తిళ్ల నడుమే పర్యటన



కారు ఫుట్ రెస్టుపై నిలబడి స్థానికులకు అభివాదం చేస్తున్న సిద్ధు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కేసులో లోకాయుక్తలో ఎఫ్ఐఆర్ నమోదైన ఒత్తిళ్ల నడుమే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మైసూరులో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. తన పదవికి రాజీనామా చేయనని, న్యాయపోరాటం చేస్తానని ఆయా వేదికలపై ఆయన స్పష్టం చేస్తూ పర్యటన కొనసాగించారు. ముఖ్యమంత్రిని, ముడా అధ్యక్షుడు మరిగౌడను ఘెరావ్ చేసేందుకు భాజపా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు, సిద్ధు అభిమానులు ఆయన ప్రయాణించిన మార్గంలో మానవహారంగా నిలబడ్డారు. మీకు మద్దతుగా మేము ఉంటాం అని నినాదాలు రాసిన అట్టముక్కలను ప్రదర్శించారు. ముందు జాగ్రత్తగా సీఎం ప్రయాణించిన మార్గాలు, పాల్గొన్న కార్యక్రమాల వద్ద పోలీసులు గట్టి భద్రతను కల్పించారు.

ఉత్సవాలకు రారండీ..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : విఖ్యాత దసరా ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మైసూరు జిల్లా పాలనా యంత్రాంగం ఆహ్వానించింది. బెంగళూరులోని ముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో జిల్లా వ్యవహారాల బాధ్యుడు మహదేవప్ప, డీసీ లక్ష్మీకాంతరెడ్డి, నగర పోలీసు కమిషనర్ సీమా లాట్కర్, అధికారులు కేఎం గాయత్రి, విష్ణువర్ధన్, డాక్టర్ పి. శివరాజ్, రూప తదితరులు ముఖ్యమంత్రిని గురువారం సాయంత్రం సత్కరించి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఉత్సవాలను ప్రారంభించేందుకు సీనియరు సాహితీవేత్త హంప నాగరాజయ్యను మైసూరు దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు.



సిద్ధరామయ్యకు మద్దతుగా నినాదాలు రాసిన అట్టముక్కలు ప్రదర్శిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

స్నేహమయి కృష్ణ మరో ఫిర్యాదు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ముడాలో జరిగిన అక్రమాలపై లోకాయుక్తలో నమోదైన కేసుల విచారణను సీబీఐకి అప్పగించాలని సహ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఉన్నత న్యాయస్థానంలో శుక్రవారం అర్జీ వేసుకున్నారు. సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతిపై మొదట స్నేహమయి కృష్ణే రాజభవన్‌లో ఫిర్యాదు చేశారు. లోకాయుక్తలో విచారణ పక్కదారి పట్టేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో సీబీఐకి కేసు బదిలీ చేయాలని ఆయన కోరారు. అర్జీపై ఉన్నత న్యాయస్థానం వచ్చేవారం విచారణ చేపట్టే అవకాశం ఉందని సంబంధిత న్యాయవాది తెలిపారు.

ప్రజ్వల్ 'బెయిల్' తీర్పు వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలతో అరెస్టయిన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిలు కోసం వేసుకున్న అర్జీపై ఉన్నత న్యాయస్థానం విచారణ పూర్తి చేసింది. ఆయనకు బెయిలు ఇస్తే సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని ప్రభుత్వ న్యాయవాది ఆచార్య రవికుమార్ వాదనలు వినిపించారు. వాదనలను ఆలకించిన న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.



సమాఖ్య ప్రతినిధులతో కలిసి గోడ పత్రికను ప్రదర్శిస్తున్న ఖాదర్ తదితరులు

వ్యవసాయ విపణికి ఆధునిక హంగులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని అన్నిరకాల వ్యవసాయ విపణుల (ఏపీఎంసీ) డిజిటలీకరణను తమ శాఖ వేగవంతం చేసిందని వ్యవసాయ మార్కెట్, జౌళి, చక్కెర శాఖ మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. దశల వారీగా డిజిటలీకరణ పూర్తయిన యార్డులను ప్రారంభిస్తామని చెప్పారు. కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య 107వ సర్వసభ్యుల సమావేశంలో శుక్రవారం స్పీకర్ యూటీ ఖాదర్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, కార్మికులు, సిబ్బంది, యువత, రాష్ట్రాభివృద్ధికి సమాఖ్య అందిస్తున్న సేవలు అమూల్యమని ప్రశంసించారు. ఐదు వేలకు పైగా సభ్యులతో పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులకు సమాఖ్య సహకారాన్ని అందిస్తోందన్నారు. ఏపీఎంసీ మార్కెట్ల అభివృద్ధికి సమాఖ్య అందిస్తున్న సూచనలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య పరిశ్రమలు, భారీ, చిన్నతరహా పరిశ్రమ పాత్ర కీలకమని స్పీకర్ యూటీ ఖాదర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను రప్పించేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విధానాలను ఆయన గుర్తు చేశారు. సమాఖ్య అధ్యక్షుడు రమేశ్ చంద్ర లహోటీ, ప్రతినిధులు ఎంజీ బాలకృష్ణ ఉమారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మఠాధిపతికే బెదిరింపులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : 'స్వామీ.. మీ వ్యవహారాలపై నా వద్ద వీడియోల రూపంలో ఆధారాలున్నాయి. మీకు సంబంధించిన అశ్లీల వీడియోలూ సేకరించా. వాటిని వెలుగులోకి తేకుండా అట్టిపెట్టాలంటే మీరు కాస్త సమర్పించుకోండి. అదీ.. ఎక్కువేం కాదు.. కేవలం రూ.6 కోట్లు' అంటూ ఆమె బెదిరించే సరికి తిపటూరు షడాక్షరి మఠాధిపతి రుద్రముని స్వామి కంగుతిన్నారు. ఇదెక్కడి బెదిరింపులంటే.. విన్న పాపాన పోలేదు. రాష్ట్ర సమాచార హక్కుల కమిషన్ అధ్యక్షుడి సోదరిని నేనేనంటూ గొంతు పెంచిన విద్యా బిరాదార్ పాటిల్ అనే మహిళపై చివరికి ఆ మఠాధిపతి ఠాణా మెట్లెక్కారు. ఆయన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తక్షణమే రాహుల్ విచారణ అసాధ్యం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై తక్షణమే విచారణ ప్రారంభించడం సాధ్యం కాదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ముందుకు వచ్చిన ప్రజాహిత వ్యాజ్యాన్ని అక్టోబరు 21కు వాయిదా వేస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద పీఠం ప్రకటించింది. మహిళలను కించపరిచేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారని అఖిల భారత దళిత యాక్షన్ కమిటీ అధ్యక్షుడు చి.నా.రాము, జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు సుశీలా దేవరాజ్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

'జమీర్‌పై కేసు వేస్తా'


ఉడుపి, న్యూస్‌టుడే : 'ముడా' కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వేసుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చిన అనంతరం మంత్రి జమీర్‌అహ్మద్ ఖాన్ చేసిన వ్యాఖ్యలపై తాను కోర్టులో కేసు దాఖలు చేస్తానని సామాజిక కార్యకర్త టీజే అబ్రహం తెలిపారు. న్యాయస్థానాలూ రాజకీయ పార్టీల్లా మారాయనే అర్థం వచ్చేలా జమీర్ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తాను అటువంటి వ్యాఖ్యలు చేయలేదని జమీర్ బెంగళూరులో స్పష్టం చేశారు.

ఆ ముగ్గురి విడుదల ఎన్నడో?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో సోమవారమే బెయిలు దొరికినా, కారాగారం నుంచి ముగ్గురు నిందితులు బయటకు రావడం సాధ్యం కాలేదు. కార్తిక్, కేశవమూర్తి, నిఖిల్ నాయక్‌లకు ష్యూరిటీ ఇచ్చేవారు లేకపోవడంతో గురువారం సాయంత్రం వరకు కారాగారంలోనే ఉన్నారు.

ఈ పయనం.. సాగేదెలా?

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర పరిధి ట్రాఫిక్ ఇక్కట్లు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. వాహన సంచార రద్దీతో విసిగిపోతున్నారు. ఈ సమస్య నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి అదుపులోకి వచ్చిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల పది నిమిషాల్లో పూర్తి చేయాల్సిన సంచారానికీ అర్ధగంట సమయం తీసుకుంటుంది. అవుటర్ రింగ్ రోడ్డులో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. సెంట్రల్ రహదారిలో తిరగడానికి కొన్ని సమయాల్లో వెనకంజ వేస్తున్నారు. మారతహళ్లి- హెచ్.ఎస్.ఆర్ లేఔట్ మధ్య సాధారణ పరిస్థితుల్లో ఎనిమిది నిమిషాల్లో ప్రయాణం సాధ్యం. ఉదయ, సాయంత్రవేళల్లో కనీసం 45 నిమిషాలు లేందే ప్రయాణం సాగదు. అవుటర్ రింగ్ రోడ్డు, మైసూరు రోడ్డు, బళ్లారి మార్గ్, హోసూరు దారి, తుమకూరు, మాగడి రహదారుల్లో పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండాలంటే ప్రజా రవాణా వ్యవస్థనే జనం ఎక్కువగా ఉపయోగించుకోవాలని సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) అనుచేత్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే దసరా సెలవులు ప్రారంభం కావడంతో సొంత ఊర్లకు బయలుదేరే వారు ఎక్కువ. ఇలాంటి వారి వాహనాలతో గురు, శుక్రవారాల్లో తలెత్తిన ట్రాఫిక్ ఇక్కట్లు అనేకం. అక్కడక్కడ మెట్రో పనులు కొనసాగుతున్న క్రమంలో రహదారులు కుదించుకుపోతున్నాయి. అవి సాధారణ స్థితికి చేరడానికి రెండు మూడు నెలలు పడుతుంది. సంచార రద్దీ ఎక్కువగా కనిపించే ప్రాంతాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడమే ఉత్తమమని సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డు, మారతహళ్లి, సర్జాపుర, సిల్క్‌బోర్డు కూడలి ప్రాంతాలు అత్యంత సమస్యాత్మకంగా మారినట్లు తెలిపారు. సిల్క్‌బోర్డు కూడలి పరిధిలో కేవలం 1.5 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి మూడు గంటల సమయం పట్టినట్లు సర్జాపుర నివాసి మహేశ్ సామాజిక మాధ్యమంలో ఉటంకించడం చర్చకు తెరలేపింది. ఆయన వాదనను బలపరుస్తూ నెటిజన్లు సమస్యలను ఏకరువు పెట్టారు. ఒక్కోసారి సాయంత్రం నాలుగు గంటలకు బడికి బయలుదేరితే.. పిల్లలను తీసుకుని ఇంటికి చేరడానికి ఎనిమిది గంటలైన సందర్భాలూ ఉన్నాయంటూ మరికొందరు వివరించారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లకు చేరుకునే వారు ఈ వారాంతం ముగిసేవరకు కనీసం రెండుగంటల ముందుగా బయలుదేరితే సరైన సమయానికి గమ్యస్థానం చేరుకుంటారని సంబంధిత అధికారి ఒకరు సూచించారు.



రింగ్‌రోడ్డులో ఉదయమే.. స్తంభించిన వాహనాలు



సర్జాపుర ఐటీ- బీటీ రహదారిలో ప్రయాణం నరకప్రాయం



బెళ్లందూరు రహదారిలో గురువారం రాత్రి పరిస్థితి తీవ్రత..



మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

దుర్గమ్మ సేవలో ఖండ్రే

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రైల్వే పథకాలు పూర్తిచేయడమే లక్ష్యం

కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమణ్ణ



తుమకూరు-యశ్వంతపుర మెము రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి సోమణ్ణ, ఎమ్మెల్యేలు జ్యోతి గణేశ్, సురేశ్‌గౌడ, కృష్ణప్ప తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైల్వే శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కేంద్ర జలశక్తి, రైల్వే సహాయ మంత్రి వి.సోమణ్ణ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తుమకూరు నగరంలోని రైల్వేస్టేషన్‌లో తుమకూరు-యశ్వంతపుర మధ్య కొత్త మెము రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పథకాలు అన్నింటిని తన హయాంలో పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. 2027 మార్చిలోపు రాయదుర్గ-తుమకూరు, దావణగెరె-తుమకూరు రైల్వే మార్గాలను పూర్తి చేస్తామన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లను ఆహ్వానించి వారి చేతుల మీదుగా ఆ మార్గాలను జాతికి అంకితం ఇస్తామన్నారు. తుమకూరు-అరసికెరె మార్గంలో రూ.220 కోట్ల వ్యయంతో సిగ్నల్స్‌ను అమర్చడానికి చర్యలు చేపట్టామని, తుమకూరును మరో బెంగళూరుగా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలోనే తుమకూరు-బెంగళూరు మార్గంలోని డబుల్ లేన్‌ను నాలుగు వరుసలుగా ఉన్నతీకరణకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక నాణెంలోని రెండు ముఖాలుగా విధులు నిర్వహిస్తే పెండింగ్ పనులు వేగవంతం కావడంతో పాటు ప్రగతి పరుగులు తీస్తుందని తెలిపారు. బెంగళూరుకు సెక్యులర్ రైళ్ల సేవలను సమకూర్చే ప్రయత్నాలు చేస్తామన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ పక్కనున్న రహదారిలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలలున్న నేపథ్యంలో విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా స్కైవాక్ నిర్మించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి గణేశ్ మంత్రికి విన్నవించారు. స్పందించిన ఆయన స్కైవాక్ నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జేడీఎస్ శాసనసభ నాయకుడు సి.బి. సురేశ్‌బాబు, ఎమ్మెల్యేలు సురేశ్‌గౌడ, కృష్ణప్ప, మాజీ ఎంపీ బసవరాజ్, మాజీ ఎమ్మెల్యే నరేంద్రబాబు, నైరుతి రైల్వే శాఖ డీఆర్ఎం యోగీష్ మోహన్, ఎస్పీ కేవీ అశోక్ తదితరులున్నారు.

దివ్యాంగ బాలికపై అత్యాచారం

హాసన, న్యూస్‌టుడే : మాటలు రాని, వినికిడి లోపం ఉన్న బాలిక (8)పై ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టాడు. ఘటన జరిగి రెండు నెలలైనా.. తనపై జరిగిన దౌర్జన్యాన్ని ఆమె చెప్పలేకపోయింది. మర్మావయవాల నుంచి రక్తస్రావం జరుగుతూ ఉండడంతో బాలిక తల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా జరిగిన ఘోరం బయటపడింది. మహిళా ఠాణాలో చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు.

తేనెవలలతో బెదిరింపులు

బెళగావి, న్యూస్‌టుడే : హనీట్రాప్ చేయడం, అపహరణలు చేసి నగదు కోసం బెదిరింపులకు పాల్పడుతున్న ఆరోపణలపై నలుగురిని శహపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తిలకవాడికి చెందిన వినాయక కురుడేకర్ నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారు. మళ్లీ డబ్బు కావాలని కొద్ది రోజులుగా వీరు వేధిస్తున్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో గాలించి.. దివ్యా సపకాళె (22), ఆమె అనుచరులు ప్రశాంత కోల్కార్, కుమార గోకరక్కనవర, రాజు గగడి అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. పది లక్షల నగదు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరచగా, రెండు వారాల న్యాయ నిర్బంధానికి పంపిస్తూ ఆదేశించారు.

భారీగా గంజాయి స్వాధీనం



గంజాయి బస్తాలు పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ దయానంద్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని వివిధ ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నారనే ఆరోపణపై ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3.12 లక్షల విలువ చేసే 51 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ దయానంద్ శుక్రవారం ప్రకటించారు. కాడుగొండనహళ్లి మైదానంలో కారులో గంజాయి ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో కేజీ హళ్లి పోలీసులు దాడులు చేశారని వివరించారు. వారి నుంచి అందిన సమాచారంతో భారీగా సరకు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కంది చేలో 'గంజాయి'

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కంది, రాగులు, అనపకాయ పంటల మధ్యలో గంజాయి సాగు చేస్తున్న నారాయణస్వామి అనే వ్యక్తిని దొడ్డబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తూబగెరె హోబళి గెద్దలపాళ్యలోని అతని పొలంలో సాగు చేసిన 568 గంజాయి మొక్కలను నాశనం చేశారు. అతని నివాసంలో దాచి ఉంచిన 8.9 కిలోల మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని, విచారణ చేపట్టారు.

మట్టిపెళ్లల కింద కార్మికుడి విషాదాంతం

హాసన : చెరువుకు పడిన గండి పడింది. దాన్ని వేగంగా పూడ్చకపోతే నీరన్నీ పంటపొలాలను ముంచేస్తాయి. ఆ పనుల్లో మునిగిపోయిన ఓ కార్మికుడు విషాదాంతమయ్యాడు. గండి పూడ్చివేతకు మట్టి సేకరించే సమయంలో.. మట్టిపెళ్లలు కూలి మీదపడడంతో దర్శన్ కుమార్ (29) అనే కార్మికుడు మరణించాడు. వసంతకుమార్, లోకేశప్ప అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బేలూరు తాలూకా హనికె వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. బేలూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెంగళూరు విపణిలో పండ్లు, కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

బీన్స్-	60
క్యారెట్-	80
బీరకాయలు-	40
క్యాబేజి-	20
కాలీఫ్లవర్ (ఒక్కోటి)-	25
సొరకాయ-	40
దొండకాయలు-	35
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	45
టమాటా (సాధారణ)-	35
గుమ్మడి-	40
ఆలుగడ్డ-	35
ఉల్లిగడ్డలు (మేలురకం)-	65
ఉల్లిగడ్డలు (సాధారణ)	50
సాంబారు ఉల్లి-	95
బీట్‌రూట్-	25
వంకాయలు-	40
బెండకాయలు-	40
ముల్లంగి-	35
నిమ్మకాయ-	200
వాషింగ్టన్ ఆపిల్	:305
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	320
అరటి కాయలు-	34
సపోటా-	55

చికిత్స వికటించి యువతి మృతి

కోలారు, న్యూస్‌టుడే : మూత్రపిండాల్లో రాళ్లతో సమస్యను ఎదుర్కొంటున్న దీప్తి (22) అనే యువతికి చేసిన శస్త్రచికిత్స వికటించి.. ఆమె మరణించింది. మాలూరు తాలూకా నంబిగానహళ్లికి చెందిన బాధితురాల్ని కోలారు శ్రేయ ఆసుపత్రిలో బుధవారం చేర్పించారు. లాప్రోస్కోపీ విధానంలో అదే రోజు శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స అనంతర ఐసీయూలో ఉంచారు. ఆమె మరణించిందని దీప్తి కుటుంబ సభ్యులకు గురువారం సమాచారం అందించారు. మత్తుమందు (అనస్తీషియా) ఎక్కువై ఆమె మరణించిందని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆసుపత్రి ముందు శుక్రవారం ధర్నాకు దిగారు. వారి ఫిర్యాదు మేరకు ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులపై కోలారు నగరఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బాబు కోసం బొమ్మ 'లారీ'



అర్జున్

కార్వార, న్యూస్‌టుడే : ఉత్తర కన్నడ జిల్లా శిరూరు సమీపంలో కొండచరియలు విరిగి పడిన ఘటనలో మరణించిన లారీ డ్రైవరు అర్జున్ కేరళలోని తన కుమారుని కోసం లారీ బొమ్మను, కొనుగోలు చేసుకున్నాడు. వరదల సమయంలో కొండచరియలు విరిగి.. లారీపై పడటంతో అది సమీపంలోని నాగావళి నదిలోకి దొర్లిపడింది. అప్పట్లో నీటి అడుగుకు చేరుకున్న లారీ క్యాబిన్‌లోనే అర్జున్ మృతదేహాన్ని గుర్తించి బుధవారం వెలికి తీశారు. క్యాబిన్‌లోనే అర్జున్ చరవాణి, మరో బొమ్మ చరవాణి, లారీ బొమ్మ, కొన్ని వంటపాత్రలు ఉన్నాయని గుర్తించారు. అర్జున్ సోదరుడు అభిజిత్‌కు వాటిని అప్పగించారు. అంకోలా ఆసుపత్రిలో మృతదేహానికి డీఎన్ఏ పరీక్ష చేసి, మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు.

స్వచ్ఛతకు ఉద్యోగుల ముందడుగు



శ్రమదానంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లాధికారి పీఎన్ రవీంద్ర సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. చిక్కబళ్లాపురలోని బసప్ప ఛత్రం ఆవరణలోని పుష్కరిణిని జిల్లా పాలన యంత్రాంగం, జిల్లా పంచాయతీ, మునిసిపల్ కౌన్సిల్, మినరల్ ట్రస్టు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి శుభ్రం చేశారు. స్వచ్ఛ భారత్‌ను నిరంతరం కొనసాగించాలన్నారు. అక్టోబరు రెండో తేదీ వరకు జిల్లా పరిధిలోని పట్టణాలున్నింటిలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీ చౌక్సే, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రకాశ్ నిట్టాలి, మినరల్ ఫౌండేషన్ ప్రతినిధి పద్మజ, అధికారులు మహేశ్ కుమార్ శివకుమార్, నాగరాజ్, వీ నాగరాజ్, ఉమాశంకర్ తదితరులు స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు.

నదిలో మునిగి అన్నదమ్ముల మృతి

కలబురగి, న్యూస్‌టుడే : అఫ్జలపుర తాలూకా దేవలగాణగాపుర దత్తాత్రేయ దేవాలయానికి మహారాష్ట్ర నుంచి వచ్చిన బాలాజీ వైద్యనాథ (49), మహేశ్ వైద్యనాథ (47) అనే సోదరులు భీమా నదిలో మునిగి మరణించారు. తమ బంధువులతో కలిసి ఆలయానికి వచ్చి.. స్నానం చేసేందుకు నదిలో దిగారు. తమ బంధువు మోహన్ నీటిలో మునిగిపోతున్నట్లు గుర్తించి, అతన్ని రక్షించేందుకు నీట దిగి అన్నదమ్ములు ఇద్దరూ మరణించారు. మోహన్‌ను స్థానికులు రక్షించారు. దేవలగాణగాపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బతుకమ్మ వేడుకలకు సన్నాహాలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కర్ణాటక తెలంగాణ సాంస్కృతిక సంఘం సన్నాహాలు ప్రారంభించింది. అక్టోబరు 5 సాయంత్రం నాలుగు గంటల నుంచి సహకార నగరలోని గుండాంజనేయ స్వామి ఆలయంలో సంబరాలు ఉంటాయి. ప్రకృతిని, పూలను ఆరాధించే ఉత్సవంగా నిర్వహిస్తున్న వేడుకల్లో ఉత్తమ బతుకమ్మ అలంకరణకు బహుమతులు ఇవ్వనున్నారు. నగరంలో స్థిరపడిన తెలంగాణ ప్రతినిధులతో పాటు, బతుకమ్మపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకుని వేడుకల్లో పాల్గొనవచ్చని సంఘం ప్రతినిధులు తెలిపారు.

లోకాయుక్త దాడులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : లంచం ఇస్తే పన్ను మొత్తాన్ని తగ్గిస్తానని ఒక కంపెనీ యజమాని నుంచి రూ.4.5 లక్షల లంచం తీసుకుంటున్న పాలికెలో ఏఆర్ఓ రాజేంద్ర ప్రసాద్, పన్ను వ్యాల్యూవర్ ప్రకాశ్‌లను లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఒక వాణిజ్య సముదాయం యజమాని ఫిర్యాదుతో సిబ్బందితో కలిసి లోకాయుక్త అధికారులు గురువారం కార్యాచరణ నిర్వహించారు.

బెంగళూరు
●బెంగళూరు ●హోసూరు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యం



విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మునిరాజు అన్నారు. శెట్టిహళ్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అక్షర దాసోహ, మధ్యాహ్న ఉపాహార పథకంలో భాగంగా ఆయన పౌష్టిక పదార్థాలు వడ్డించి మాట్లాడారు. పిల్లలకు వారంలో ఆరు రోజులు గుడ్డు, అరటిపండు, చిక్కి అందిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ మాజీ సభ్యురాలు గౌరమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (మత్తికెరె)

ముఖ్యమంత్రి సహాయ నిధికి చేయూత



ఉమ్మడి విజయవాడ, గుంటూరు జిల్లాల్లో వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తన వంతుగా బెంగళూరు తెదేపా ఫోరం రూ.2.5 లక్షల విరాళాన్ని అందజేసింది. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల రెడ్డితో కలిసి ఫోరం సభ్యుడు, తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండు తలపనేని, బీటీఎఫ్ ప్రతినిధులు వీరా కనకమేడల, సోంపల్లి శ్రీకాంత్ తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి చెక్కు అందజేశారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (గ్రామీణం)

సామాన్యులకూ ఆధునిక వైద్యం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: సామాన్యులకు అందుబాటులో ఆధునిక వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని రెవెన్యూ మంత్రి కృష్ణభైరేగౌడ అన్నారు. ఇందుకోసం నూతన విధానాలు అమలు చేసే ప్రయత్నాల్లో ఉందన్నారు. శుక్రవారం ఇక్కడ జక్కూరులో ఏర్పాటు చేసిన ఆర్‌ఎక్స్‌డీఎక్స్ హెల్త్‌కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న పేదలకు ప్రైవేటు ఆసుపత్రులు అతి తక్కువ ధరలకు ఆధునిక వైద్య సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ సునీతా మహేశ్వరి మాట్లాడుతూ జక్కూరు, హెబ్బాళ్, థణిసంద్ర, ఆర్‌కే హెగ్డేనగర తదితర ప్రాంతాల్లో ఆధునిక వైద్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్జున్ కళ్యాణ్‌పుర తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ జిల్లా పాలనాధికారి వెంకటేశ్

చిత్రదుర్గం జిల్లా పాలనాధికారి వెంకటేశ్ వివిధ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి



కృషి చేసినందుకు ప్రభుత్వం ఆయనను రాష్ట్ర అత్యుత్తమ జిల్లా పాలనాధికారి అవార్డు-2024తో సత్కరించింది. శుక్రవారం బెంగళూరులోని వికాస సౌధలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి కృష్ణభైరేగౌడ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి వెంకటేశ్‌ను జడ్పీ సీఈఓ సోమశేఖర్, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు అభినందించారు. -న్యూస్‌టుడే, చిత్రదుర్గం

కరాటే పోటీలకు చైత్రశ్రీ, మాన్య ఎంపిక

బెంగళూరు సాంకేతిక శిక్షణ సంస్థ ఆతిథ్యం వహించిన వీటీయు అంతర కళాశాల కరాటే (ట్రయల్) పోటీల్లో నగరానికి చెందిన చైత్రశ్రీ, మాన్య బంగారు పతకాలు సాధించారు. గురువారం సాయంత్రం ముగిసిన ఈ పోటీల్లో డా.



అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తరఫున మహిళల విభాగంలో తలపడిన చైత్రశ్రీ కటాల్, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తరఫున ఆడిన మాన్య కుమితేలో పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సాధనతో వారిద్దరూ దక్షిణ విశ్వవిద్యాలయం (సౌత్‌జోన్ యూనివర్సిటీ) కరాటే గేమ్స్ 2024-25కు ఎంపికయ్యారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

కొతాస్ కాఫీకి 75 వసంతాలు



కాఫీ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న శ్రీనాథన్, నితిన్, గణేశ్ శ్రీనివాస్

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నేటి తరం అభిరుచులకు తగ్గట్టుగా రుచిలో ఏమాత్రం తేడా రాకుండా ప్రపంచ కాఫీ అభిమానుల మనసులో ప్రత్యేక గుర్తింపుతో తమ సంస్థ 75 వసంతాలు పూర్తి చేసుకుందని కొతాస్ కాఫీ సంస్థ డైరెక్టర్ కేవస్ నితిన్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శివాజీనగర్‌లో 1949లో ఒక చిన్న అంగడితో ప్రారంభమైన తమ సంస్థ నేడు ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో విస్తరించిందని తెలిపారు. రూ.300 కోట్ల టర్నోవర్‌ను చేరుకుందని తెలిపారు. మరో ఐదేళ్లలో రూ.1000 కోట్ల టర్నోవర్ లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. తమ సంస్థ 18 రకాల పాలు, కాఫీ, శీతల పానీయాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కాఫీ గింజలను కర్ణాటకలోని కూర్గ్, కుశాల్‌నగర్ వైనాడ్ తదితర ప్రాంతాలనుంచి ప్రత్యేకంగా సేకరిస్తున్నట్లు వెల్లడించారు. మరో డైరెక్టర్ గణేశ్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ సంస్థ సామాజిక సేవా రంగంలోనూ ముందుందన్నారు. ఆధునిక సాంకేతికతతో వినియోగ దారులకు ఫిల్టర్ కాఫీ రుచులు అందిస్తోందని సంస్థ ఛైర్మన్ కె.శ్రీనాథన్ తెలిపారు. అనంతరం నూతన లోగోను ఆవిష్కరించారు. ఇన్‌స్టంట్ కాఫీ పొడి తదితర ఉత్పత్తులు ప్రదర్శించారు.


మహాగణపతి నిమజ్జనానికి సర్వం సిద్ధం

● శోభాయాత్రకు గట్టి పోలీసు భద్రత

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: మహాగణపతి శోభాయాత్ర, నిమజ్జనం శనివారం చిత్రదుర్గంలో నిర్వహిస్తారు. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పట్టణంలోని వివిధ కూడళ్లను చూడ ముచ్చటగా అలంకరించారు. శోభాయాత్ర కొనసాగే చెళ్లకెర కూడలి నుంచి శివమొగ్గ రహదారిలోని కనకదాసు కూడళ్ల వరకు వివిధ రకాల విగ్రహాలు పర్యాటకులను ఆకట్టుకునేలా రూపొందించారు. మదకరి కూడలిలోని రాజవీర మదకరి నాయక విగ్రహం వద్ద దుర్గం ఆకారంలో నిర్మాణం చేశారు. కనకదాసు, వాసవి, ఒనకేఓబవ్వ కూడళ్లు సుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం ఎస్పీ రంజిత్ కుమార్ బండారు విలేకరులకు భద్రత, ఇతర అంశాల గురించి వివరించారు. వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలతో పాటు 3.20లక్షల మందికిపైగా భక్తులు రానున్నట్లు అంచనా వేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఐదు డ్రోన్ కెమెరాలతో పాటు 72 మంది వీడియో గ్రాఫర్లు పనిచేస్తారన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు 3,500మంది పోలీసులు, గృహరక్షకభటులు అందుబాటులో ఉంటారన్నారు. వీరిలో వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన ఆరుగురు ఏఎస్పీలు, 353 మంది డీవైఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, 10 రాష్ట్ర సాయుధ రిజర్వు పోలీసు, 12 జిల్లా సాయుధ రిజర్వు పోలీసు, 4 క్యూఆర్‌టీ దళాలున్నట్లు వివరించారు.



చూపరులను ఆకట్టుకొనే కనకదాసు కూడలి



హిందూ మహాగణపతి విగ్రహం

వాహనాల రాకపోకలు నిషేధం



శోభాయాత్ర సంచరించే ప్రధాన రహదారిలో చెళ్లకెర నుంచి చంద్రవళ్లి కూడళ్ల వరకు శనివారం రోజున ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధించారు. పట్టణంలోకి వచ్చే, బయటకు వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేశారు. శోభాయాత్రను చూడటానికి ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపైకి భక్తులు, ప్రజలు ఎక్కకుండా నిషేధించారు. ఆరోజున పట్టణంలో మద్యం విక్రయాలు ఉండవని ఎస్పీ స్పష్టం చేశారు.

నగరంలో ఈనాడు

● ఉదయం 8 గంటలకు డాక్టర్ రాజ్‌కుమార్ రహదారిలోని సెయింట్ థెరెసా ఆసుపత్రి వద్ద ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే వాక్‌థాన్‌ను ఆరోగ్య మంత్రి దినేశ్‌గుండూరావు ప్రారంభిస్తారు.

● ఉదయం 10.30 గంటలకు రాజప్రస్థానం మైదానంలోని కింగ్స్ కోర్ట్‌లో భారతీయ ఆభరణాలు, లైఫ్ స్టైల్ నగల ప్రదర్శన కొనసాగుతుంది.

● ఉదయం 11.30 గంటలకు జయనగర టీబ్లాక్ వివేకా ఆడిటోరియంలో పాంచజన్య పురస్కారాల ప్రదానం జరుగుతుంది.

-న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

చిత్రకళా పరిషత్తులో 'ది సౌక్ మార్కెట్'

బెంగళూరు (మల్లేశ్వరం, శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రకళా పరిషత్తులో హస్తకళా ఉత్పత్తుల మేళా 'ది సౌక్ మార్కెట్'ను కంటెంట్ క్రియేటర్ మిలన్ సింఘాల్ శుక్రవారం ప్రారంభించారు. దసరా పండగ కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకొని గ్రాండ్ ఫ్రీ మార్కెట్ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులను ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. తయారీదారు నుంచి నేరుగా వినియోగదారులు కొనుగోలు చేసేలా ఇక్కడ వందకు పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. అక్టోబరు 6 వరకు ప్రదర్శన, విక్రయాలు కొనసాగనున్నాయి.



నగలను ప్రదర్శిస్తున్న మిలన్ సింఘాల్

వస్త్రాభరణ-2024 ప్రదర్శన : నేటి తరం అభిరుచులకు తగ్గట్టుగా చిత్రకళా పరిషత్తులో వస్త్రాభరణ-2024 పేరిట క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ కర్ణాటక చీరలు, ఇతర వస్త్రాల విక్రయానికి స్టాళ్లను ఏర్పాటు చేసింది. వీటిని నటి, దర్శకురాలు రేవతి శుక్రవారం ప్రారంభించారు. కొందరు రూపదర్శులు ఆయా సంస్థల, బ్రాండ్ల చీర కట్టుతో ర్యాంప్ వాక్ చేశారు. చేనేతను ప్రోత్సహించే దిశలో తాము ప్రదర్శనతో విక్రయాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబరు 1 రాత్రి 7.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

అమ్మవారి ఆలయంలో ఆకట్టుకున్న పుష్పాలంకరణ

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: కోరిన వరాలిచ్చే శక్తిస్వరూపిణిగా పూజలందుకుంటున్న బోయకొండ గంగమ్మ ఆలయాన్ని శుక్రవారం పుష్పాలంకరణతో ప్రత్యేక అకర్షణగా తీర్చిదిద్దారు. ఏటా కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లికి చెందిన చంద్రశేఖర్, మనోహర్, సతీష్‌లు దసరా మహోత్సవాలకు ముందు వచ్చే శుక్రవారం ఉచితంగా ఆలయాన్ని అలంకరించడం పదేళ్లుగా చేపడుతున్నారు. సుమారు రూ.4 లక్షలు విలువ చేసే పూలతో ఆలయాన్ని రెండు రోజులుగా అలంకరించారు. ప్రత్యేకంగా కూర్చిన పూలదండ అమ్మవారి మెడలో వేశారు. ఉదయం నిర్వహించిన రాహుకాలాభిషేకంలో ఉభయదారులు పాల్గొన్నారు. పుష్పాలంకరణ చేసిన దాతలను ఈవో ఏకాంబరం సత్కరించారు.



ఆలయంలో పుష్పాలంకరణ

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తుమకూరు, న్యూస్‌టుడే : తిపటూరు రూరల్ సరిహద్దులోని కుడువనఘట్ట గ్రామానికి చెందిన నింగప్ప 1997 మే 4న తన భార్య గౌరమ్మ ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. నొణవినకెరె పోలీసులు నిందితుని ఆచూకీ కోసం చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. 27 ఏళ్ల తర్వాత నింగప్ప కడువఘట్ట గ్రామానికి వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందడంతో నింగప్పను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో..

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులు శ్రీనివాస్, మంజునాథ్‌లను రాజగోపాల్‌నగర పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14 లక్షల విలువచేసే 245 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. జక్కూరు ప్రధాన రహదారిలో ఉన్న ఇంట్లో నిందితులు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

30 ద్విచక్ర వాహనాల పట్టివేత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఇళ్ల ముంగిట నిలిపిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న నిందితుడు అజీమ్‌ను కేఆర్ పురం పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.22.50 లక్షల విలువైన 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఎనిమిది ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. కేఆర్‌పురం, హెచ్‌ఏఎల్, మహదేవపుర, పరప్పన అగ్రహార, బ్యాడరహళ్లి, హెబ్బగూడి తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిక్కిన జూదరులు : రూ.2 లక్షల స్వాధీనం

పావగడ, న్యూస్‌టుడే : తుమకూరు ఎస్పీ కె.వి.అశోక్ మార్గదర్శనలో స్పెషల్ స్క్వాడ్, పావగడ పట్టణ సీఐ సురేశ్ నేతృత్వంలో పోలీసులు తాలూకాలోని గుమ్మఘట్ట సమీపంలోని ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం జూదమాడుతున్న 32 మందిని అదుపులోకి తీసుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లా మడకశిర తాలూకా ప్రాంత వాసులు, పావగడ తాలూకాకు చెందిన వారు కలిసి అధిక సంఖ్యలో భారీ ఎత్తున జూదం ఆడుతున్నట్లు సమాచారం అందిన వెంటనే జూదం ఆడుతున్న స్థావరంపై దాడిచేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు. జూదరుల నుంచి రెండు లక్షల నగదు, 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్వార్థరహిత సమాజం కోసమే ప్రాణత్యాగం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మానవాళి శాంతి, స్వార్థరహిత సమాజం కోసం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేశారని న్యూ జెరూసలెం హార్విస్ట్ మినిస్ట్రీ బిషప్ డాక్టర్ రంగరాజు అన్నారు. శుక్రవారం ఇక్కడి హెణ్ణూరులో న్యూజెరూసలెం చర్చిలో జరిగిన పుట్టిన రోజు కార్యక్రమంలో ఆయన కేకు కోసి భక్తులకు పంచి మాట్లాడారు. స్వార్థరహిత సమాజ స్థాపనకు అందరూ శ్రమించాలని పిలుపునిచ్చారు. మనశ్శాంతి ఇంట్లో నుంచి రావాలని సూచించారు. ప్రార్థనలే సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ శ్యామ్, పాస్టర్ ఎర్నస్టపాల్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగులకూ సేవలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: తమ ఉద్యోగులు, సిబ్బందికి ఉచిత నేత్ర పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ముందుకు రావాలని వాసన్ కంటి ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులను జలమండలి అధ్యక్షుడు, ఐఏఎస్ అధికారి రామ్ ప్రసాద్ మనోహర్ కోరారు. ఆయన బొమ్మనహళ్లిలో ఆసుపత్రి కొత్త శాఖను ప్రారంభించి మాట్లాడారు. ఎక్కువమందికి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్య సేవలందించేందుకు ప్రైవేటు ఆసుపత్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జలమండలిలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ భానుప్రతాప్ భరోసా ఇచ్చారు.

జలజీవన్ మిషన్ పథకం ప్రారంభం

పావగడ, న్యూస్‌టుడే: పట్టణం, తాలూకాలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో 2018-19 2020-21 ఏడాదులకు సంబంధించి గంగా కల్యాణ పథకం కింద బోరుబావులు తవ్విన బోవి సముదాయంలో రైతులకు ఉచిత మోటారు పంపు, పైపులు, విద్యుత్తు పరికరాలు అందచేశారు. తన స్వగ్రామంలో పూర్తయిన ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించి నీరు వదిలారు. మరిదాసనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కోడిగుడ్లు అందజేశారు.

నాణ్యమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులు ప్రశాంత వాతావరణం కోసం మొక్కలు నాటి పెంచాలని పరిసరవాది రేవతి కామత్ సూచించారు. ఆమె శుక్రవారం శ్రీకృష్ణా విద్యా సంస్థలోని డిగ్రీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యా సంస్థ ఛైర్మన్ డా.రుక్మాంగదనాయుడు ప్రసంగిస్తూ విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేసినపుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

అథ్లెటిక్స్‌లో ఆళ్వాస్‌కు ఛాంపియన్‌షిప్



దక్షిణ జిల్లా స్థాయి దసరా క్రీడా పోటీల్లో ఆళ్వాస్ ఆటగాళ్లు ఛాంపియన్‌షిప్ సాధించారు. శుక్రవారం విజేతలను ఆళ్వాస్ శిక్షణ ప్రతిష్ఠాన అధ్యక్షుడు డా.ఎం.మోహన్‌ఆళ్వా అభినందించారు. మంగళూరు క్రీడాంగణంలో జరిగిన పురుష, మహిళల విభాగాల అథ్లెటిక్స్ పోటీల్లో మొత్తం 23 స్వర్ణ, 10 రజత, 2 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. కుస్తీలో 16 బంగారు, ఎనిమిదేసి రజత, కాంస్య, యోగాలో ఐదు పసిడి, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖోలో పురుష, మహిళల విభాగంలో తొలి స్థానాల్లో నిలిచారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

'సీఎం.. ఇప్పటికైనా రాజీనామా చేయండి'

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: ముడాలో అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికైనా తన పదవికి రాజీనామా చేయాలని భాజపా అధికార ప్రతినిధి హెచ్‌ఎన్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టు, లోకాయుక్తలు దర్యాప్తునకు ఆదేశించించడం, మైసూరులో కేసు నమోదైన నేపథ్యంలో నైతిక బాధ్యతగా రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని హితవు పలికారు. సీఎం పదవిని కాపాడుకునేందుకు హైకోర్టు నుంచి సర్వోన్నత న్యాయస్థానం వరకు వెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సందకుంటె కృష్ణమూర్తి, కొండెనహళ్లి మురళి, ఏవీ భైరేగౌ, హొసహళ్లి రామన్న, ఆర్‌ఎన్ అశోక్, రామాంజినప్ప, మధుచంద్ర పాల్గొన్నారు.

వృద్ధుడికి అరుదైన హృదయ చికిత్స

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: గుండె వ్యాధితో బాధపడుతున్న 84 ఏళ్ల వృద్ధుడికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బైపాస్ గ్రాఫ్టింగ్ (సీఏబీజీ) విధానం ద్వారా నగరంలోని ట్రిలైఫ్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు నిలబెట్టారు. శుక్రవారం ఇక్కడ ఆరోగ్యంగా ఉన్న వృద్ధుడితో కలిసి వైద్యులు కేకు కోసి సంతోషం వ్యక్తం చేశారు. వైద్యుడు తమీమ్ అహ్మద్ మాట్లాడుతూ ఎక్కువ వయసు కలిగిన వారికి బైపాస్ ఆపరేషన్ చాలా కష్టమని, వివిధ వ్యాధులతో బాధపడుతుంటారని, వాటిని అదుపులోకి తెచ్చి శస్త్రచికిత్సతో మూసుకుపోయిన కవాటాన్ని బాగుచేసి రక్తం సరఫరా జరిగే చేశామని తెలిపారు.

ఆహార పరిశ్రమల గణనీయ అభివృద్ధి

బెంగళూరు (మత్తికెరె) : దేశంలోని ఆహార పరిశ్రమలు గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నాయని, ఎగుమతులు 6 రెట్లు పెరిగాయని బెంగళూరు ఛాప్టర్ ఏఎస్‌సీటీఐ అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఇక్కడి అంతర్జాతీయ ప్రదర్శనశాలలో ఎఫ్ఐ ఇండియా, ప్రోప్యాక్ ఇండియా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. 2030 నాటికి పాల ఉత్పత్తి 230 నుంచి 300 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుతుందన్నారు. రెండో అతి పెద్ద మాంసం ఉత్పత్తిదారుగా ఉంటాయన్నారు. దశాబ్దం క్రితం పోలిస్తే నేడు ప్యాకింగ్ పరిశ్రమ దాదాపు ఆరు రెట్లు పెరిగిందన్నారు. ఎఫ్ఐ ఇండియా 18వ ఎడిషన్, ప్రోప్యాక్ ఇండియా 6వ ఎడిషన్‌ను బెంగళూరులోనే ప్రారంభిస్తాయన్నారు. బిజినెస్ అడ్వాన్స్‌మెంట్ ఛాంబర్ అధ్యక్షుడు నీలేష్, ప్రముఖులు బిజినెస్ ప్రసాద్, బాలన్‌అయ్యర్, సాగర్‌సింగ్ పాల్గొన్నారు.

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని సి.కె.పుర గ్రామంలో జగ్జీవన్ రామ్ సముదాయ భవనంలో భారతీయ పరివర్తన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న నాలుగు గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు హెచ్.కెంచరాయ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులకు సాగు పట్టాలు, ధ్రువీకరణ పత్రాలు, భూమిపై హక్కులను ఇవ్వడం లేదని వాపోయారు. రైతులు సాగు పట్టాల కోసం వెళ్లినప్పుడు ఎవరైనా లంచం అడిగితే ఇవ్వకూడదని సూచించారు. తాలూకాలోని గోమాల భూమి సాగు చేస్తున్న రైతులకు స్థల పరిశీలన చేసి పట్టాలు అందచేస్తామన్నారు. కొత్తూరు, టి.ఎన్.కోట, సి.కె.పుర, హరిహరపుర రైతులతో ముందస్తు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీపీఎస్ సంఘం తాలూకా సంయోజకుడు హరిహరపుర హెచ్.డి.ఈరణ్ణ, కళాకారుడు నాగరాజు, నరసింహమూర్తి, సి.కె.పుర హనుమంతరాయప్ప, రామప్ప, దొడ్డణ్ణ, జయరామ్ పాల్గొన్నారు.



రైతులతో బీపీఎస్ సంఘం సభ్యులు

కొనసాగుతున్న వీఏఓల నిరసన

తుమకూరు, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లాధికారి కార్యాలయం ముందు వీఏఓలు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శిబిరం వద్దకు వచ్చిన తహసీల్దార్ రాజేశ్వరికి నిరసన కారులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా వీఏఓల సంఘం అధ్యక్షుడు ఎస్.దేవరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సోమవారంలోపు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే, విధులకు సెలవులు పెట్టి నెల పాటు సమ్మె కొనసాగిస్తామన్నారు. పనిభారం పెరగడంతో సెలవుల్లోనూ విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. తమ డిమాండ్లను వెంటనే తీర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరసన తెలిపిన వారిలో జిల్లాలోని వివిధ తాలూకాల వీఏఓలు ఉన్నారు.



తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న దేవరాజ్ తదితరులు

బళ్లారి

•బళ్లారి •రాయచూరు

వ్యవసాయ విపణికి ఆధునిక హంగులు


సమాఖ్య ప్రతినిధులతో కలిసి గోడ పత్రాలు ప్రదర్శిస్తున్న ఖాదర్ తదితరులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని అన్నిరకాల వ్యవసాయ విపణుల (ఏపీఎంసీ) డిజిటలీకరణను తమ శాఖ వేగ వంతం చేసిందని వ్యవసాయ మార్కెట్, జౌళి, చక్కెర శాఖ మంత్రి శివానంద పాటిల్ తెలిపారు. కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య 107వ సర్వసభ్య సమావేశంలో శుక్రవారం స్పీకర్ యూటీ ఖాదర్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలు, కార్మికులు, సిబ్బంది, యువత, రాష్ట్రాభివృద్ధికి సమాఖ్య అందిస్తున్న సేవలు అమూల్యమని ప్రశంసించారు. సమాఖ్య అధ్యక్షుడు రమేశ్ చంద్ర లహోటీ, ప్రతినిధులు ఎంజీ బాలకృష్ణ ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కనకదుర్గమ్మ సేవలో ఖండ్రే

ఇంద్రకీలాద్రి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత కనకదుర్గమ్మను కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు అమ్మ వారి దర్శనం చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వ చనం చేశారు. దేవస్థానం అధికారి జగదీష్ ఆయనకు అమ్మ వారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారి జగదీష్

ఈ పయనం.. సాగేదెలా?

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర పరిధి ట్రాఫిక్ ఇక్కట్లు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. వాహన సంచార రద్దీతో విసిగిపోతున్నారు. ఈ సమస్య నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి అదుపులోకి వచ్చిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల పది నిమిషాల్లో పూర్తి చేయాల్సిన సంచారానికి అర్ధగంట సమయం తీసుకుంటుంది. అవుటర్ రింగ్ రోడ్డులో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. సెంట్రల్ రహదారిలో కొన్ని సమయాల్లో వెనకబడ వేస్తున్నారు. మారతహళ్లి- హెచ్.ఎస్.ఆర్ లేఔట్ మధ్య సాధారణ పరిస్థితుల్లో ఎనిమిది నిమిషాల్లో ప్రయాణం సాధ్యం. ఉదయం, సాయంత్రవేళల్లో కనీసం 45 నిమిషాలు లేందే ప్రయాణం సాగదు. అవుటర్ రింగ్ రోడ్డు, మైసూరు రోడ్డు, బళ్లారి మార్గ్, హోసూరు దారి, తుమకూరు, మాగడి రహదారుల్లో పరిస్థితి చేయిదాటి పోకుండా ఉండాలంటే ప్రజా రవాణా వ్యవస్థనే జనం ఎక్కువగా ఉపయోగించుకోవాలని సంయుక్త పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) అనుచేత్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే దసరా సెలవులు ప్రారంభం కావడంతో సొంత ఊళ్లకు బయలుదేరే వారి సంఖ్య ఎక్కువ. గురు, శుక్రవారాల్లో తలెత్తిన ట్రాఫిక్ ఇక్కట్లు అనేకం. అక్కడక్కడ మెట్రో పనులు కొనసాగుతున్న క్రమంలో రహదారులు కుదించుకుపోయాయి. అవి సాధారణ స్థితికి చేరడానికి రెండు మూడు నెలలు పడుతుంది. సంచార రద్దీ ఎక్కువగా కనిపించే ప్రాంతాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంపికచేసుకోవడం ఉత్తమమని సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డు, మారతహళ్లి, సర్జాపుర, సిల్క్‌బోర్డు కూడలి ప్రాంతాలు అత్యంత సమస్యాత్మకంగా మారినట్లు తెలిపారు. సిల్క్‌బోర్డు కూడలి పరిధిలో కేవలం 1.5 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి మూడు గంటల సమయం పట్టినట్లు సర్జాపుర నివాసి మహేశ్ సామాజిక మాధ్యమంలో ఉటంకించడం చర్చకు తెరలేపింది. ఆయన వాదనను బలపరుస్తూ నెటిజన్లు సమస్యలను ఏకరువు పెట్టారు. ఒక్కోసారి సాయంత్రం గంటలకు బడికి బయలుదేరితే.. పిల్లలను తీసుకుని ఇంటికి చేరడానికి ఎనిమిది గంటలైన సందర్భాలూ ఉన్నాయంటూ మరికొందరు వివరించారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లకు చేరుకునే వారు ఈ వారాంతం ముగిసేవరకు కనీసం రెండుగంటల ముందుగా బయలుదేరితే సరైన సమయానికి గమ్యస్థానం చేరుకుంటారని సంబంధిత అధికారి సూచించారు.


రింగ్‌రోడ్డులో ఉదయమే.. స్తంభించిన వాహనాలు


సర్జాపుర ఐటీ-బీటీ రహదారిలో ప్రయాణం నరకప్రాయం


బెళ్లందూరు రహదారిలో గురువారం రాత్రి పరిస్థితి తీవ్రత..

ఆర్థికాభివృద్ధిలో పర్యాటక రంగం పాత్ర కీలకం


పర్యాటక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న బోసురాజు, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : దేశ ఆర్థిక ప్రగతిలో పర్యాటక రంగం పాత్ర కీలకమని చిన్న నీటిపారుదల, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి బోసురాజు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బస్టాండ్ దగ్గర్లోని కోట ఆవరణలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకొన్నారు. మంత్రి మొక్కకు నీళ్లు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక కట్టడాలు, కోటలు, స్మారకాలు, ప్రదేశాలను ఆకర్షణ రీతిలో అభివృద్ధి చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని వివరించారు. జిల్లాకు ఆదాయం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాయచూరు తాలూకాలోని మలియాబాద్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రముఖ కేంద్రాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ, జడ్పీ సీఈవో రాహుల్ తుకారం పాండ్యే, జిల్లా అదనపు పాలనాధికారి శివానంద, పర్యాటకశాఖ సహాయక నిర్దేశకుడు రాజేంద్ర జల్దార్, సీనియర్ కౌన్సిలర్ జయణ్ణ, తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానిని హత్య చేసిన పురోహితుడు


శోభా పాటిల్


శివ బండయ్యస్వామి

రాయచూరు, న్యూస్‌టుడే : ఇంటిని ఖాళీ చేయాలని కోరిన యజమానిని బాడుగదారుడైన పురోహితుడు హత్య చేసిన సంఘటన రాయచూరులో కలకలం సృష్టించింది. ఏమీ తెలియనట్లు మృతురాలికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఎట్టికేలకు పాపం పండి పోలీసులకు దొరికిపోయారు. వివరాలు. శోభా పాటిల్ (63) అనే వృద్ధురాలు రంగమందిరానికి దగ్గర్లో అయ్యప్ప స్వామి గుడి వెనుక నివసిస్తోంది. ఈమె కుమారుడు, కూతురు బెంగళూరులో ఉన్నారు. ఇక్కడ ఈమె ఒక్కరే ఉంటున్నారు. ఇంటి పైగదిని రెండేళ్ల క్రితం శివ బండయ్యస్వామికి అద్దెకు ఇచ్చింది. ఈమె బిడ్డల వద్దకు తరచూ వెళ్లి వస్తుండేది. ఈ నెల 21న బెంగళూరు నుంచి వచ్చిన ఆమె పైన ఇంట్లో తామే ఉంటామని ఖాళీ చేయాలని శివకు సూచించింది. ఆ ఇంటిని వదలటానికి ఇష్టం లేని అతడు శోభా పాటిల్‌పై కోపాన్ని పెంచుకున్నారు. 24వ తేదీ రాత్రి 9 గంటలకు కింద ఇంట్లోకి వెళ్లి ఆమెతో గొడవ పడి గొంతు పిసికి చంపేశారు. మరుసటి రోజు ఆమె పిల్లలకు ఫోన్ చేసి మీ అమ్మ చనిపోయిందని చెప్పారు. తమ తల్లికి గుండె సంబంధమైన సమస్య ఉన్నందున సాధారణంగా చనిపోయిందని భావించారు. శివతోనే అంత్యక్రియలు, ఇంటి శుద్ధి చేయించారు. మృతురాలి మెడలోని బంగారు గొలుసు, చెవి రింగులు, చరవాణి కన్పించకపోడంతో కుమారుడికి అనుమానం వచ్చి పశ్చిమఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంట్లోని సీసీ కెమెరా పుటేజీని పరిశీలించడంతో హత్య దృశ్యాలు కన్పించాయి. గురువారం రాత్రి నిందితుడు శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

1న విశ్రాంత ఉద్యోగుల ఆందోళన


పాత్రికేయులకు వివరిస్తున్న శంకరప్ప

రాయచూరు, న్యూస్‌టుడే : పదవీ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులకు ఏడో వేతన కమిషన్ సిఫార్సులోని సౌలభ్యాలను వర్తింప చేయాలని కర్ణాటక విశ్రాంత ఉద్యోగుల వేదిక రాష్ట్ర సంచాలకుడు శంకరప్ప లమాణి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబరు 1న జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఆయన శుక్రవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2022 జులై 1 నుంచి 2024 జులై 31 మధ్య ఉద్యోగ విరమణ చేసిన 17,600 మందికి ఆరో వేతనం సిఫార్సుల ప్రాతిపదికన ప్రయోజనాలను కల్పిస్తున్నందున ఆర్థికంగా నష్టపోతారని వివరించారు. 30 నుంచి 40 ఏళ్లు పాటు సేవలందించిన ఉద్యోగులపై ఉదాశీనతంగా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. న్యాయ సమ్మతమైన డిమాండ్‌ను గంభీరంగా తీసుకోవాలన్నారు. ఇప్పటికే విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు భైరప్ప ఈ సమస్యపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వివరించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆందోళనకు తరలి రావాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు బూదెప్ప, అమరేశ్, విశ్వనాథ్‌రెడ్డి పాటిల్, బసవరాజ్, హనుమంతప్ప పాల్గొన్నారు.

పాత పింఛన్ పద్ధతితో ప్రయోజనాలు


వినతి పత్రాన్ని చదువుతున్న ప్రతినిధి

రాయచూరు, న్యూస్‌టుడే : పాత పింఛన్ పద్ధతిని అమలు చేయాలని 'ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం' ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందకుమార్, ప్రధాన కార్యదర్శి దిలీప్ నాయకత్వంలో ప్రతినిధులు జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలులో ఉన్న విధానం, కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన యూపీఎస్ పద్ధతి వల్ల 2007 తర్వాత చేరిన ఉద్యోగులకు ప్రయోజనం ఉండదని వివరించారు. పాత విధానంలో పదవీ విరమణ చేస్తే మంచి పింఛన్ వస్తుందని, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. ఉద్యోగులు ఓపీఎస్ కావాలని కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో రాయచూరు తాలూకా అధ్యక్షుడు రెహమాన్, కార్యదర్శి మడివాళప్ప, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, తాలూకా అధ్యక్షుడు మల్లేష్ నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం


సాగుతున్న శోభాయాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే: హిందూ మహాగణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 21 రోజుల వినాయక నిమజ్జనం శోభాయాత్ర శుక్రవారం రాయచూరులో అత్యంత వైభవంగా సాగింది. గణనాథుడి నామస్మరణతో వీధులన్నీ ప్రతిధ్వనించాయి. మధ్యాహ్నం గంజ్ కూడలిలోని ఆర్‌జీఎస్ కల్యాణ మంటపం వద్ద యాత్ర మొదలైంది. వందలాది యువకులు ముందు నడిచారు. సంప్రదాయ నృత్యాలు, భక్తిగీతాల మధ్య చంద్రమౌళేశ్వర కూడలి, పటేల్ రహదారి, శెట్టి బావి చౌక్, తీనకందిల్ మీదుగా రాత్రికి ఖాసబావిని చేరుకొంది. వీధుల్లో భక్తులు స్వామికి సాదర స్వాగతం పలికారు. బావి వద్ద విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రేన్ సాయంతో గంగమ్మ చెంతకు చేర్చారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ ప్రతినిధులు నాయకత్వం వహించారు. గట్టి బందోబస్తు మధ్య నిమజ్జనం ముగిసింది.

ముగ్గురు తహసీల్దార్లకు అవార్డులు


కృష్ణభైరేగౌడ నుంచి అవార్డులు అందుకొంటున్న తహసీల్దార్లు

మాన్వి, న్యూస్‌టుడే : ఉత్తమ పని తీరు కనబరిచిన మాన్వి తహసీల్దార్ రాజు ఫిరంగి, సిరివార తహసీల్దార్ రవి ఎస్ అంగడి, బాదామి తహసీల్దార్ జె.బి.మజ్జిగి ఉత్తమ తహసీల్దార్లుగా అవార్డులకు ఎంపికైన విషయం తెలిసిందే. శుక్రవారం బెంగళూరు వికాస్‌సౌధలో రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ చేతుల మీదుగా పలువురు జిల్లా పాలనాధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు అవార్డులు అందుకున్నారు. రాయచూరు జిల్లాకు చెందిన ముగ్గురి తహసీల్దార్లు అవార్డులు అందుకోవడంపై రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మగువ మనసు దోచిన 'మైసూరు'


మగువలు ఇష్టపడే మైసూరు పట్టుచీరలు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు పట్టు చీరలకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) దక్కాక.. దేశ, విదేశీ మగువల ఆసక్తి మరింతగా పెరిగింది. దసరా వస్తుండడంతో ఈ చీరలకు గిరాకీ పెరిగింది. చీరల దుకాణాల ముందు తమ వంతు వచ్చే వరకు మహిళలు వరుసలో నిలబడుతున్నారు. ఇటీవల ఓ రోజు.. కేవలం ఏడు నిమిషాల్లోనే 200 మైసూరు సిల్కు చీరలు విక్రయించామని మైసూరులోని కేఎస్ఐసీ అధికారులు తెలిపారు. ప్రతి శనివారం కొత్త చీరలు, మోడళ్లు కేఎస్ఐసీకి వస్తుంటాయి. వీటితో పాటు పండగకు ప్రత్యేక రాయితీలు ఇస్తుండడంతో ఎక్కువ మంది కొనుగోలుదారులు చీరల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది మే 25న మైసూరు పట్టు చీరల ధరలు 15 శాతం వరకు పెరిగాయి. ప్రతి శనివారం పది నుంచి 20 శాతం వరకు రాయితీ ఇస్తుండడంతో ఎక్కువ మంది ఆ రోజే చీరలను కొనుగోలు చేసుకునేందుకు దుకాణం తెరిచే సమయానికి ముందుగా వచ్చి వరుసలో నిలబడుతున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1912లో మైసూరు పట్టు చీరలను అప్పటి మహారాజు నాల్వడి కృష్ణరాజ ఒడెయరు ప్రారంభించారు. బెంగళూరులో ఎంజీరోడ్డు, బసవేశ్వరనగర, జయనగర, కేజీ రోడ్డు, గాంధీ బజార్, డీవీజీ రోడ్డు, మల్లేశ్వరం, మైసూరులో యాత్రీ నివాస్, కేఆర్ కూడలి, జంతు ప్రదర్శనశాల పక్కన, కర్మాగార ఔట్‌లెట్, దావణగెరె, చెన్నై, హైదరాబాద్‌లో సంస్థ ప్రత్యేకంగా ప్రదర్శనశాలలను నిర్వహిస్తోంది. పది మగ్గాలతో ప్రారంభమైన పరిశ్రమలో ఇప్పుడు 150 మగ్గాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

సేంద్రియ ఎరువులు వాడాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి శివశంకర్

మాన్వి, న్యూస్‌టుడే : మట్టి నమూనాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని మూస పద్ధతి తగదని వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆహార భద్రత యోజన కింద క్షేత్రోత్సవాన్ని శుక్రవారం గోర్కల్ గ్రామంలో నిర్వహించారు. రైతులు అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారకాలను పరిమితి లేకుండా వేయటం వల్ల చెడు ప్రభావాలు ఎదురవుతున్నాయన్నారు. సారవంతమైన భూములు చౌడుబారుతున్నాయన్నారు. మట్టి పరీక్షలు చేయించి అందుకు తగ్గ ఎరువులను మాత్రమే వినియోగించాలన్నారు. రసాయనాల స్థానంలో సేంద్రీయ ఎరువుల వినియోగం పెరగాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన శుద్ధి, ఎరువుల వినియోగం, మట్టి పరీక్ష, సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖులు గట్టు బసవరాజప్ప, మల్లేశ్, రాజు, నరసప్ప, పరమేశప్ప, గూళెప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌర కార్మికుల సేవలు అపారం


కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు

రాయచూరు, న్యూస్‌టుడే : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పౌర కార్మికులు అందిస్తున్న సేవలు అపారమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతి బాగడే పేర్కొన్నారు. కొన్ని రోజులు వీరు పనిచేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోలేమన్నారు. కార్మికుల సేవలకు ప్రజలు సహకరిస్తే వీధులు సుందరంగా మారుతాయన్నారు. జిల్లా న్యాయసేవల ప్రాధికార, జిల్లా న్యాయవాదుల సంఘం, రాయచూరు నగరసభ సంయుక్తంగా స్వచ్ఛతా హీ సేవా అభియాన్‌లో భాగంగా శుక్రవారం కోర్టు ఆవరణలో శ్రమదానం చేశారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు చీపుర్లతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆరోగ్య రక్షణకు ఇంటితో సహా చుట్టు పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించాలని కోరారు. ప్రజల భాగస్వామంతో అక్టోబర్‌లో బస్టాండ్‌లో స్వచ్ఛతా పనులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున, న్యాయమూర్తులు శ్రీకాంత్, హత్తికాళ్ ప్రభు సిద్ధప్ప, సాత్విక్ హాజరయ్యారు.

క్రీడలతో బహుముఖ ప్రజ్ఞ

సింధనూరు : చదువు ఒక్కటే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థులు బహుముఖ ప్రతిభవంతులు కావొచ్చని సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్టేడియంలో జిల్లా విద్యాశాఖ, స్థానిక అనికేతన కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయచూరు జిల్లాస్థాయి జూనియర్ కళాశాల విద్యార్థుల క్రీడాపోటీల ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖులు డీహెచ్.కంబళి నాడగౌడ, కె.విరుపాక్షప్ప, జయరామయ్య పాల్గొన్నారు.

సాయిబాబా వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్‌జీ క్యాంపు రోడ్డు వద్ద ఉన్న శిరిడి సాయిబాబా ఆలయంలో జయంత్యుత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సాయిబాబాకు అభిషేక పూజలు, హారతులు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి వెల్లడించింది. ఐదో వార్డు కౌన్సిలర్ సూర్యకుమారి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. అన్నసంతర్పణకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. జాలాపూరు (శ్రీనగర్) క్యాంపునకు చెందిన మితుకుమిల్లి సోదరులు సుబ్రమణ్యం, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఏటా ఈ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.83	1619.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	15,135	1,230
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	15,228	9,606
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.109	58.780

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

'ఎమ్మెల్యే యత్నాళ్ సభ్యత్వాన్ని రద్దుచేయాలి'

మాన్వి, న్యూస్‌టుడే : విజయపుర ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ముస్లిం సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 19న ముధోళ్ పట్టణంలో జరిగిన ఓ బహిరంగ సభలో ఎమ్మెల్యే టిప్పుసుల్తాన్‌పై తీవ్రవ్యాఖ్యలు, హేళన చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ముస్లిం సంఘాలు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. టిప్పుసుల్తాన్ కూడలి నుంచి ప్రముఖ వీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, ప్రముఖులు ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ఆయనను శాసన సభ్యత్వాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. యత్నాళకు వ్యతిరేకంగా ఆందోళన కారులు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు సయ్యద్ హుసేన్, మహ్మద్ రెహమత్ అలి, సయ్యద్ సజ్జాద్ హుసేని, ఇస్మాయిల్, సాధిక్ హుసేన్ ఖురేషీ, జాగీర్ సాహెబ్‌గురు, సయ్యద్ ముస్తాక్‌ఖాద్రి, నాసిర్ అలి, జిలానీ కురేషీ, హకీం కురేషీ, జావిద్‌ఖాన్, ముస్లిం యువకులు పాల్గొన్నారు.


ముస్లిం సమాజం నిరసన ప్రదర్శన

కన్నడ కోసమే జీవించిన చంపా


సదస్సులో మాట్లాడుతున్న కళస

రాయచూరు, న్యూస్‌టుడే : ఆచార్య చంద్రశేఖర్ పాటిల్ (చంపా) కన్నడ భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎయిమ్స్ సాధనా పోరాట సమితి సంచాలకుడు బసవరాజ కళస ప్రశంసించారు. శుక్రవారం స్థానిక ప్రైవేట్ కళాశాల సభాభవన్‌లో దివంగత చంపా జీవితం-రచనలు చర్చించేందుకు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళస మాట్లాడుతూ పాటిల్ ఆంగ్ల అధ్యాపకుడైనా.. మాతృభాష మీద మమకారంతో జీవన చరమాంకం వరకు కన్నడ కోసం బతికిన గొప్ప భాషాభిమానిగా పేర్కొన్నారు. కన్నడిగులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్య పరిచారని వివరించారు. అధ్యాపకుడు వీరేశ్ హులి, డాక్టర్ షరీఫ్, సిండికేట్ మాజీ సభ్యుడు శరణబసవ పాటిల్ తదితరులు మాట్లాడారు.

మైసూరు చిత్రకళా శిబిరానికి మాన్వి కళాకారులు


చిత్రకళాకారుడు వాజిద్

మాన్వి, న్యూస్‌టుడే : మైసూరు దసరా మహోత్సవ చిత్రకళా శిబిరంలో పాల్గొనాల్సిందిగా మాన్వి పట్టణానికి చెందిన చిత్రకళాకారులు వాజీద్, సాజిద్‌లకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. మైసూరు చిత్రకళా కళాశాల (కావా)లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ 3వరకు శిబిరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కళాకారులు హాజరవుతారు. ఈ శిబిరంలో 3×3 సైజులో ఓ కళాకృతిని రూపొందించాల్సి ఉంటుందని కర్ణాటక లలితకళా అకాడమీ రిజిస్ట్రార్ బి.నీలమ్మ తెలిపారు. దసరా మహోత్సవ చిత్రకళా శిబిరానికి మాన్వి కళాకారులకు అవకాశం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.